
ఈనాడు ఆదివారం

1 మార్చి 2026







అందరూ 'డెలూలు' అనే పిలుస్తున్నారు!

'సర్వం మాయ' సినిమా చూసిన వాళ్లంతా ఓ అందమైన ఆడ దెయ్యంతో ప్రేమలో పడిపోతున్నారు. తనే రియా శిబు. కేవలం అందంతోనే కాదు దెయ్యం పాత్రలో తన నటనా ప్రతిభతోనూ మాంచి క్రేజ్ సంపాదించుకుందీ బ్యూటీ. కుర్రకారు ముద్దుగా 'డెలూలు క్వీన్' అని పిలుచుకుంటున్న ఆ భామ పరిచయమే ఇది...

అదే తొలిసారి

మాది కేరళలోని తిరువనంతపురం. నాన్న శిబు థమీన్స్ సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్. ఇంటర్ వరకూ సొంతూరిలోనే చదివా. చెన్నైలోని లయోలా కాలేజీలో విజువల్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ పూర్తి చేశా. అప్పుడే తొలిసారిగా నాకు బయటి వాతావరణం ఎలా ఉంటుందో తెలిసింది. నాకో తమ్ముడు హృదు హరూన్. తను కూడా నటుడే.

'కత్తి'లాంటి డైలాగ్

కోవిడ్ సమయంలో టిక్‌టాక్ వీడియోలూ, డబ్‌స్మాష్‌లూ బాగా చేసేదాన్ని. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. టీనేజీలోనే నాకంటూ ఓ ఫ్యాన్ బేస్‌ను సంపాదించుకున్నా. విజయ్ సినిమా 'కత్తి'లోని ఓ డైలాగ్ చెబుతూ నేను చేసిన రీల్ ఒకటి అప్పట్లో బాగా వైరల్ అయ్యింది. దాంతో ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు వచ్చింది. చిన్నప్పటి నుంచి ఏదైనా క్రియేటివ్‌గా చేయాలనుకోవడం, మా కుటుంబ నేపథ్యమూ తోడవడంతో సినిమాల్లోకి రావాలని ఉండేది. అదే విషయాన్ని ఇంట్లో చెబితే ముందు చదువు పూర్తి చేయమన్నారు. అమ్మానాన్నల మాట విని, డిగ్రీ వరకూ అసలా ఊసే ఎత్తలేదు.



నిర్మాతగా ఇండస్ట్రీలోకి...

ఎవరైనా తెరపైన కనిపించి సినిమాల్లోకి అరంగేట్రం చేస్తుంటారు. కానీ, నేనేమో తెర వెనక బాధ్యతలతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టా. 2023లో మా సొంత బ్యానర్‌లో తమిళంలో 'థగ్స్' అనే చిత్రానికి నిర్మాతగా ఇండస్ట్రీలోకి వచ్చా. అదే ఏడాది మరో రెండు సినిమాలనూ నిర్మించా. ఆ మరుసటి ఏడాది 'కప్' చిత్రంతో వెండితెరపైన తొలిసారి కనిపించా.

ఆ ఇంటర్వ్యూ చూసి...

మొదటి చిత్రంతో నాకు అంత గుర్తింపు దక్కకపోయినా... రెండో సినిమా 'సర్వం మాయ' మాత్రం నన్ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఆ సినిమా దర్శకుడు ఓసారి ఇన్‌స్టా చూస్తుండగా.. నేను గతంలో ఓ రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూ కనిపించిందట. అందులో మలయాళాన్నీ, ఇంగ్లిష్‌నీ కలగలిపి నేను మాట్లాడే విధానం ఆయనకు బాగా నచ్చింది. వెంటనే మా నాన్నకు ఫోన్ చేసి, నాకు నటించే ఆసక్తి ఉందా అని అడిగారట. నాన్న సూచనతో ఆయన నేరుగా నాకే ఫోన్ చేసి కథ చెప్పారు. ఆ తర్వాత స్క్రీన్ టెస్టు చేసి, ఆడ దెయ్యం పాత్రకు నన్ను ఎంపిక చేశారు. సినిమా విడుదలయ్యాక, 'ఎవరీ అమ్మాయి?' అంటూ అందరూ నా గురించి ఆరా తీయసాగారు. తెలిసిన వాళ్లంతా నన్ను 'డెలూలు' అంటూ పిలవడం మొదలుపెట్టారు.



అదో మహాసముద్రం

కంటెంట్ క్రియేటర్... నటి... నిర్మాత - ఈ మూడింట్లో మీకు ఏది ఇష్టమని కొందరు అడుగుతుంటారు. కంటెంట్ క్రియేటర్‌గానే నాకు సోషల్ మీడియాలో మంచి గుర్తింపు వచ్చింది. అందుకే దాన్నెప్పుడూ వదులుకోను. ఇక నటన అంటారా... మంచి పాత్రలు వస్తే కచ్చితంగా నటిస్తాను. చిత్ర నిర్మాణం అనేది ఓ మహాసముద్రం లాంటిది. అందులో ఎంత నేర్చుకున్నా, తెలుసుకోవాల్సింది ఇంకా ఉంటూనే ఉంటుంది.

కంఫర్ట్‌కే ప్రాధాన్యం

నా దృష్టిలో ఫ్యాషన్ అంటే కంఫర్ట్. అందుకే, ట్రెడిషనల్‌ని మోడర్న్ లుక్‌తో కలిపి అప్పుడప్పుడూ ప్రయోగాలు చేస్తుంటా. హంగామాల జోలికి పోకుండా సహజంగా ఉండేందుకే ప్రయత్నిస్తుంటా.

అది ఎంతో ప్రత్యేకం

'డెలూలు'గా నా నటనను మెచ్చుకుంటూ అందరూ మెసేజులూ, ఫోన్లూ చేస్తుంటే నాకంటే ఎక్కువ మా నాన్నే సంతోషపడుతున్నారు. అయితే, సూర్య-జ్యోతిక దంపతులు అభినందనల నోట్‌తోపాటు ఓ బహుమతినీ పంపించారు. అది మాత్రం నాకు చాలా చాలా ప్రత్యేకం.

నా మూడ్‌ని బట్టి...

ఖాళీ సమయాల్లో ఏం చేయాలో ప్రత్యేకంగా ప్లాన్ చేసుకోను. ఆరోజు నా మూడ్‌ని బట్టి చదవడమో, పెయింటింగ్ వేయడమో, యోగా సాధనో... ఇలా ఏదో ఒకటి చేస్తుంటా. ఒక్కోసారి మా అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్తుంటా. కొన్నిసార్లు మా ప్రొడక్షన్ ఆఫీస్‌కి వెళ్లి, అక్కడ నాన్న పనిని దగ్గరుండి గమనిస్తుంటా.

లోపల

మంచిమాట

జీవితమనేది మనం నడిచే దారి లాంటిది. మనకు తోడుగా నడిచేవారు ఉంటారు కానీ మనకు బదులుగా నడిచేవారు ఉండరు... మనమే నడవాలి ఎంత కష్టమైనా.

అవి తినకుండా ఉండాల్సింది...



అత్తగారు: ఇదిగో కోడలా... నేను కడుపుతో ఉన్నప్పుడు ఏమి తినీ తాగేదాన్నో అవే నా బిడ్డకూ అలవాటయ్యాయి. నువ్వు కూడా అడ్డమైన చిరుతిళ్లు తగ్గించి, మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకో.

కోడలు: అలాగే అత్తయ్యా, ఏది ఏమైనా మీరు కడుపుతో ఉన్నప్పుడు మందూ, సిగరెట్లకి కాస్త దూరంగా ఉండాల్సింది.

మన సామెత

కుండలో కూడు కదలకూడదు, పిల్లలు గుండులా ఉండాలన్నాడట.



ముందువైపు గోపాలుడు... వెనుకవైపు జగన్మోహిని!

అలంకార ప్రియుడైన శ్రీమహావిష్ణువు ఓ వైపు మదనగోపాలుడిగా, మరోవైపు స్త్రీమూర్తిగా దర్శనం ఇచ్చే అరుదైన రూపం తాళ్లపూడి జగన్మోహినీ మదనగోపాలస్వామి క్షేత్రంలో కనిపిస్తుంది. వివాహాలు కుదిర్చే పెళ్లిపెద్దగా, అనారోగ్యాల్ని నయం చేసే అపర ధన్వంతరిగా, సంతానాన్ని ప్రసాదించే వర ప్రదాతగా ప్రసిద్ధిపొందిన ఈ స్వామికి ఏడాదికోసారి నిర్వహించే కల్యాణాన్ని చూసి తీరాల్సిందే.



పచ్చని కొబ్బరిచెట్లతో అలరారే పట్టిసీమ అందాల మధ్య పావన గోదావరి నదీతీరాన కనిపిస్తుంది తాళ్లపూడి జగన్మోహినీ మదనగోపాలస్వామి క్షేత్రం. తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండల కేంద్రంలోని ఈ ఆలయంలో విష్ణుమూర్తి... రుక్మిణీ- సత్యభామ సహిత జగన్మోహినీ మదనగోపాలస్వామిగా పూజలు అందుకుంటున్నాడు. స్వయంభువుగా కొలువుదీరిన స్వామిని కల్యాణమూర్తిగా, సంతానప్రదాతగా అర్చిస్తారు. ఈ మూర్తి ఆవిర్భావం వెనుక కొన్ని కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

ఎలా అవతరించాడంటే...

ఓసారి సతీదేవి తండ్రి అయిన దక్షప్రజాపతి ఓ యాగాన్ని తలపెట్టాడు. ఆ యాగానికి కుమార్తెనూ, అల్లుడైన శివుడినీ ఆహ్వానించలేదట. అయినా మమకారం కొద్దీ వెళ్లిన సతీదేవిని దక్షుడు అవమానించడంతో, అది తట్టుకోలేక ఆమె అగ్నికి ఆహుతి అయ్యింది. దీంతో పరమశివుడు ప్రళయ తాండవం చేస్తూ తన జటాజూటం నుంచి ఒక జడను తీసి నేలపైన విసిరికొట్టాడట. దాన్నుంచి వీరభద్రుడు ఉద్భవించి, శివుడి ఆజ్ఞానుసారం ఆ యజ్ఞాన్ని ధ్వంసం చేసి, పట్టిసం అనే ఆయుధంతో దక్షుని శిరస్సును ఖండించాడట. తర్వాత ఆ పట్టిసం దేవకూటాద్రి (ప్రస్తుత పట్టిసీమ) పైన పడటంతో వీరభద్రుడు దానికోసం అక్కడికి వెళ్లాడట. అది తెలిసి భయపడిన దేవతలు బ్రహ్మదేవుడిని ప్రార్థించారు. వీరభద్రుడికి భద్రకాళిని చూపించమని చెప్పాడట బ్రహ్మ. అయినా వీరభద్రుడి ఆగ్రహం చల్లారకపోవడంతో విష్ణువు తనలోని మదనమోహిని రూపాన్ని భద్రకాళికి ఇచ్చి - గోదావరిలో స్నానమాచరించమన్నాడట. ఈలోగా భద్రుడిని శాంతింపచేసేందుకు మురళిని వాయించాడట విష్ణువు. దానికి తన్మయత్వం పొందిన భద్రుడు మదనమోహిని రూపంలో ఉన్న భద్రకాళిని చూసి మోహించి తనకు ఇచ్చి కల్యాణం జరిపించమని విష్ణువును కోరాడట. అలా విష్ణుమూర్తి భద్రకాళి- వీరభద్రుల కల్యాణానికి కారణమై, ఆ తర్వాత జగన్మోహినీ మదనగోపాలుడిగా ఇక్కడ స్వయంభువుగా కొలువుదీరాడని వీరభద్ర విజయం, బ్రహ్మవైవర్తపురాణాలు పేర్కొంటున్నాయి. మరో కథ ప్రకారం... వశిష్ఠుడితోపాటు ఇతర రుషులు ఈ ప్రాంతంలో సత్రయాగాన్ని తలపెడితే రాక్షసులు భగ్నం చేసేందుకు యత్నించారట. ఆ మునిపుంగవులు బ్రహ్మదేవుడిని ప్రార్థించగా, రాక్షసుల దృష్టిని మరల్చేందుకు విష్ణుమూర్తి అంశ అయిన మదనమోహిని రూపంతో ఓ మోహనాంగిని సృష్టించాడట బ్రహ్మ. ఆ మోహిని అందానికీ, వేణుగానానికీ పరవశులైన రాక్షసులు ఆడి పాడటం ఆరంభించగానే సప్తర్షులు యాగం మొదలుపెట్టారు. అది గమనించిన శంబరుడనే అసురుడు ఆ మోహనాంగిని మింగేశాడట. తర్వాత ఆమె విష్ణుమాయ అని గ్రహించిన అసురులు యాగాన్ని మళ్లీ ధ్వంసం చేసేందుకు యత్నించడంతో, శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రంతో వాళ్ల తలల్ని నరికాడట. అలా ఈ తీర్థానికి చక్రతీర్థమనే పేరు వస్తే, ఆ రుషుల కోరికమేరకు విష్ణుమూర్తి జగన్మోహిని మదనగోపాలస్వామిగా ఇక్కడ కొలువుదీరాడనేది కథనం.

ఎలా చేరుకోవచ్చు

ఈ ఆలయానికి రైల్లో రావాలనుకునే భక్తులు కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో దిగొచ్చు. అక్కడి నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉండే ఆలయాన్ని చేరుకునేందుకు బస్సులూ ప్రైవేటు వాహనాలూ ఉంటాయి. అదే, రాజమహేంద్రవరంలో దిగితే, ఆలయం సుమారు 26 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

– సంకాబత్తుల పోశారావు, న్యూస్‌టుడే, తాళ్లపూడి



ముక్కుకు అడ్డపుల్ల, కాళ్లకు అందెలతో...

తూర్పు గోదావరి జిల్లా ర్యాలీలో కొలువైన జగన్మోహినీ కేశవ స్వామికీ, ఇక్కడ కనిపించే మదనగోపాలస్వామికీ కొన్ని సారూప్యాలున్నాయి. ఇక్కడా స్వామికి వెనుకవైపు జుట్టు ముడివేసిన శిఖ, వల్లెవాటు చీరతో స్త్రీ రూపం కనిపిస్తుంది. అలాగే, స్వామి పాదాలకు గజ్జెలు, ముక్కుకి అలంకరించిన అడ్డపుల్లనూ స్పష్టంగా చూడొచ్చు. ఇక్కడా స్వామి పాదాల నుంచి నిరంతరం నీరు కారుతున్నట్లుగా తడి కనిపిస్తుంది. రుక్మిణీ - సత్యభామలతో కలిసి సర్వాలంకారశోభితుడై దర్శనం ఇచ్చే మదనగోపాలుడికి రోజువారీ పూజలు కాకుండా ఏటా ఫాల్గుణ ఏకాదశినాడు జరిపించే కల్యాణం, ద్వాదశినాడు నిర్వహించే రథోత్సవాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ స్వామికి కల్యాణం జరిపిస్తే త్వరగా వివాహం కుదురుతుందనీ, సంతానం కలుగుతుందనీ ఓ విశ్వాసం. మూలమూర్తుల దర్శనంతోపాటు మహాగణపతి, రాజ్యలక్ష్మి, ఆంజనేయుడు...తదితర దేవతామూర్తులనూ పూజించొచ్చు. ఈ ఆలయంలో నిర్వహించే జన్మాష్టమి వేడుకల్నీ చూసి తీరాల్సిందే.

కష్టం చూసి కదిలొచ్చాయ్..!

వ్యవసాయం నుంచి వ్యోమయానం వరకూ అన్ని రంగాల్లోనూ నేడు స్టార్టప్స్ వచ్చేశాయి. కానీ అవి పెద్దగా పట్టించుకోని కొన్ని ప్రజాసమూహాలూ మనమధ్య ఉంటూనే ఉన్నాయి. అలాంటివాటిపైన దృష్టిపెట్టిన ఈ సంస్థలు విభిన్న సేవల్ని అందిస్తున్నాయి.

అది... 'ఇస్త్రీ ప్రాజెక్టు'

ఇంట్లో ఒకటికి రెండు ఐరన్ బాక్సులున్నా... రోజూ ఇస్త్రీ చేసే తీరిక ఉండదు చాలామందికి. అందుకే, ప్రతి వీధి మూలలోనూ అపార్టుమెంట్లలోనూ ఇస్త్రీ చేసేవాళ్లు కనిపిస్తున్నారు. వీళ్లలో ఎక్కువమంది బొగ్గుతో పనిచేసే ఐరన్ బాక్సులే వాడుతుంటారు. ఆ బొగ్గుని కాల్చి వాడటానికి ఉదయం, మధ్యాహ్నం రెండుగంటలు వాళ్ళు వెచ్చించాల్సి వస్తుంది. ఆ రెండుగంటలు మిగిలితే ఇంకొన్ని బట్టల్ని ఇస్త్రీ చేసి, ఆ మేరకు ఆదాయం పొందవచ్చన్న ఆలోచన వచ్చింది ఉద్యం వ్యాపార్ అనే స్టార్టప్‌కి. అలా 'ఎల్పీజీ ఐరన్ బాక్సుల్ని' ఇస్త్రీవాలాలకి పరిచయం చేసింది. వాటిని సబ్సిడీలతోనో ఉచితంగానో అందిస్తోంది. ఆ సంస్థ ఊహించినట్టే ఇస్త్రీవాలాలకి ఆ రెండుగంటలు కలిసి రావడమే కాదు... నెలనెలా బొగ్గుకయ్యే రూ. 5 వేల(కేజీ రూ. 70 లెక్కన) ఖర్చు తగ్గుతోంది. ఈ ఎల్పీజీ ఐరన్ బాక్సులతో ఇస్త్రీవాలాల ఆదాయం పాతికశాతం మేర పెరిగిందని చెబుతున్నారు 'ఉద్యం వ్యాపార్' సంస్థ వ్యవస్థాపకుడు కృష్ణన్ రంగనాథన్. హైదరాబాద్‌లో రోటరీ సంస్థ 'ఇస్త్రీ ప్రాజెక్టు'ని చేపట్టి... కార్మికులకి ఉచితంగా ఎల్పీజీ ఐరన్ బాక్సుల్ని పంచుతోంది!



పెన్షన్ అవసరాల కోసం...

ఏదో ఒక రోజు అందరం వృద్ధాప్య దశలోకి వచ్చేవాళ్లమే. ఉద్యోగవిరమణ తర్వాత మన ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందోనన్న బెంగ ఇంచుమించు అందరిలోనూ ఉంటుంది. అటు ప్రభుత్వాలూ ఇటు ప్రైవేటు సంస్థలూ ఇందుకోసం ప్రత్యేక పెన్షన్ పథకాలెన్నో తెస్తున్నాయి. వాటి గురించి ఎంతో సమాచారం దొరుకుతున్నాయి కానీ... ఎన్నో అనుమానాలు వెనక్కిలాగుతూనే ఉంటాయి. అలాంటివాళ్లకి సాయపడుతుంది పెన్షన్ బాక్స్ సంస్థ. నేషనల్ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్) ఖాతాని కేవలం రెండు నిమిషాల్లోనే ఆన్‌లైన్‌లో తెరిపిస్తుంది. దాని ద్వారా మన పొదుపు, మదుపు వివరాలన్నీ ఒకే చోట ఎప్పుడైనా ఎక్కడైనా చూసుకునే అవకాశం ఇస్తుంది. ఆ రకంగా పెన్షన్ సేవల్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేసిన తొలి అంకుర సంస్థగా ఇది గుర్తింపు సాధించింది. ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన అన్నదమ్ములు కుల్దీప్ పరాశర్, శివం పరాశర్ పెన్షన్ బాక్స్‌ని ప్రారంభించారు. తమ తల్లిదండ్రుల కోసం పెన్షన్ పథకాన్ని వెతికితే... ఆ సేవలు అందించే ఆన్‌లైన్ సంస్థలేవీ కనపడలేదట. దాంతో 2020లో ఈ సంస్థని ప్రారంభించి... ఆరేళ్లలోనే కోట్లలో పెట్టుబడులు సాధించారు.







కొడైకెనాల్ పూలు... మూడేళ్లైనా వాడిపోవు!

మండువేసవిలోనూ చల్లగా పలకరించే కొడైకెనాల్ పేరుచెబితే... కొండలమాటున దోబూచులాడే పొగమంచు అందాలు, అరుదుగా విరిసే నీలకురింజి పూల సొగసులు, హోమ్‌మేడ్ చాక్లెట్లే గుర్తుకొస్తాయి. వీటితోపాటు కొడైకెనాల్‌కి మరో ప్రత్యేకతా ఉంది. అదేంటంటే కొడైకెనాల్ డ్రైఫ్లవర్ బొకేలు. వీటినే ఎవర్‌లాస్టింగ్ బొకేలనీ అంటారు. ఏ జాగ్రత్తలూ తీసుకోక పోయినా ఈ పూలు మూడేళ్లవరకూ రంగుపోకుండా అలానే ఉంటాయి. అలాగని అవి ఏ ప్లాస్టిక్ పూలో అనుకుంటే పొరపాటు. సహజమైనవే... మరి తాజాగా ఎలా ఉంటాయీ అంటే- అదే వీటి ప్రత్యేకత. స్ట్రాఫ్లవర్స్ లేదా ఎవర్‌లాస్ట్ ఫ్లవర్స్ అని పిలిచే ఈ పూలు ఎరుపు, నారింజ, గులాబీ, తెలుపు... ఇలా అనేక రంగుల్లో దొరుకుతాయి. ఎండబెట్టినా రంగుపోవు, మూడేళ్లపాటు అదే రంగులో ఉంటాయి. నీటి కరవుని తట్టుకుని పెరిగే జాతి. అందుకే స్థానికులు ఈ పూలని బొకేలుగా మార్చి అమ్ముతూ, ఉపాధి పొందుతున్నారు.

నీ వెంటే నేనుంటా...

ఎవరైనా మన వెనకాలే వస్తుంటే వాళ్లని 'ఏంటీ... నీడలా వెంటాడుతున్నావ్' అంటాం. మరి మనం ఎక్కడున్నా, ఎంత రద్దీలో ఉన్నా మన వెనకే హచ్ కుక్కలా వెంటాడే రోబోలని ఏమనాలి? చైనాలో వీటిని షాడో రోబోలనీ, ఫాలోయింగ్ రోబోలనీ అంటున్నారు. సరే కానీ వీటితో మనకొచ్చే లాభం ఏంటీ అని ఆలోచిస్తున్నారా? ఉంది... షాపింగ్‌మాల్స్ సూపర్‌మార్కెట్లలో బరువైన సరకులని మోసుకెళ్తూ ఇబ్బందిపడాల్సిన అవసరం లేదు. చూడ్డానికి షాపింగ్ ట్రాలీలా ఉండే ఈ రోబోలో సరకులని వేసుకుని వెళ్లిపోవడమే. ఇక ఈ రోబో మీరెంత రద్దీలో ఉన్నా జనాలని తప్పించుకుని చివరికి మీ దగ్గరకు వచ్చేస్తుంది. ఏ మూల ఏ వస్తువు ఉందో తెలియక ఇబ్బంది పడుతుంటే దీన్ని అడిగితే దారి చూపిస్తుంది, కొన్న వస్తువే కొంటే హెచ్చరిస్తుందట కూడా. షాపింగ్‌మాల్స్‌లో సరకులు మోయలేక ఇబ్బంది పడుతున్న ఆడవాళ్లని చూసిన తర్వాత ఆజీబాట్ అనే సంస్థ ఏఐ పరిజ్ఞానంతో పనిచేసే ఈ ఫాలోయింగ్ రోబోలని తయారుచేసిందట. ఇందుకోసం ఏ రిమోట్ అక్కర్లేదు... మాల్‌లో అడుగుపెట్టినప్పుడు ఒక్కసారి మన ముఖాన్ని రిజిస్టర్ చేసుకుంటే చాలు, ఇక మనవెనకాలే వచ్చేస్తుందీ రోబో.



రంగురంగుల రిబ్బన్లు ఎందుకంటే...

ఒక వరసంతా ఎరుపురంగు రిబ్బన్లూ, మరో వరసంతా నీలం రంగు రిబ్బన్లూ, ఆపై వరసంతా గులాబీరంగు రిబ్బన్లూ... ఇలా రంగురంగుల రిబ్బన్లతో జడలు వేసుకున్న పిల్లలంతా ఒక చోట చేరి- చూడ్డానికి అదో పూలవనంలా ఉంది కదా! ఈ దృశ్యం నెల్లూరు జిల్లాలోని సంగం బాలికల గురుకుల పాఠశాలలోనిది. రంగులు బాగున్నాయి సరే... ఎందుకిలా ధరించారనే సందేహం వచ్చిందా? గ్రౌండ్‌లో, బయటా పిల్లలు ఆడుకుంటున్నప్పుడూ, లేదా ఏదైనా అనుకోని పరిస్థితుల్లో చిక్కుకున్నప్పుడూ ఆ పిల్లలు ఏ తరగతి వాళ్లూ, ఏ స్కూల్ వాళ్లూ అని దూరం నుంచే చూసి గుర్తుపట్టడానికి వీలుగా ఆ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు ఇలాంటి విధానం అనుసరిస్తున్నారట. దానికి తగ్గట్టు పిల్లలు వారికి కేటాయించిన రంగుల్లో రిబ్బన్లు ధరించి స్కూల్‌కి రావడంతో ఇదిగో ఇలా అందంగా కనువిందు చేస్తోంది దృశ్యం.





వర్షం జాడ చెప్పే గుడి...

'వాన రాకడ ప్రాణం పోకడ' ఎవరికీ తెలియదని అంటారు కానీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ దగ్గరున్న బెహతాబజార్ గ్రామంలోని ప్రజలు మాత్రం అలా అంటే ఒప్పుకోరు. ఎందుకంటే వాళ్ల ఊళ్లోని జగన్నాథ ఆలయానికో ప్రత్యేకత ఉంది. ఈ ఆలయం వర్షాలూ, తుపానుల రాకను రెండువారాల ముందే చెబుతుందని ఆ గ్రామస్థుల నమ్మకం. ఎటువైపు చూసినా గుండ్రని పైకప్పుతో ప్రత్యేక నిర్మాణశైలితో ఉండే ఈ ఆలయంలో గర్భగుడి చల్లగా మారినా, జగన్నాథ విగ్రహంపైన చెమ్మ, నీటి చుక్కలు కనిపించినా అది వర్షసూచన అనుకుంటారు ఆ ఊరి వాళ్లు. ఆ సమయం నాట్లు వేయడానికి అనుకూలమైనదిగా భావిస్తారు. ఆ పైకప్పు పూర్తిగా ఎండిపోతే వర్షం ఆగిపోతుందని నమ్ముతారు. ఈ ఆలయాన్ని ఎవరు నిర్మించారో తెలియదు కానీ, ఎన్నో ఏళ్లగా ఈ గుడిలో ఉండే వాతావరణ పరిస్థితుల ఆధారంగానే ప్రజలు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారట.



వయసుమీరిన పెద్దవాళ్లకే కాదు, డబ్బు లేక కంటి వైద్యానికి దూరమవుతున్న పేదవాళ్లకీ, చీకటిని తొలగించుకుని రంగుల లోకాన్ని చూడాలని ఆశపడే చిన్నవాళ్లకీ... ఆ ఆసుపత్రి అంటే ఓ నమ్మకం, ధైర్యం. 36 ఏళ్లుగా ఉచిత కంటివైద్యంతో లక్షలమందిలో వెలుగులు నింపుతున్న ఆ ధైర్యం పేరు... రేకుర్తి కంటి ఆసుపత్రి.



పేదల కంటి వెలుగు... రేకుర్తి ఆసుపత్రి!



అది కరీంనగర్‌లోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఛారిటబుల్ కంటి ఆసుపత్రి... సమయం ఉదయం పది గంటలు. ఆ ఆసుపత్రి ఆవరణలో ఓ బస్సు ఆగింది. ఆ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అనేకమంది ఊతకర్ర సాయంతోనో, ఇతరుల తోడుతోనో తడబడుతూనే బస్సు దిగి ఒక్కొక్కరుగా లోపలికి వస్తున్నారు. ‘మళ్లీ ఈ లోకాన్ని మునుపటిలా చూస్తానా, అసలు నా జీవితంలో చూపు వస్తుందా’... ఇలా అనేక అనుమానాలూ, భయాలూ, సందేహాలతో అడుగుపెట్టిన వాళ్లకి- వాటన్నింటినీ ఆసుపత్రి బయటే వదిలేయమని అక్కడి సిబ్బంది ఆత్మీయంగా వెన్నుతట్టి ధైర్యమిస్తున్నారు. అది నిజమే మరి... ఆ ఆవరణలోకి వచ్చిన తర్వాత ‘కంటివైద్యమా బోలెడు ఖర్చు’ అని భయపడాల్సిన అవసరం లేదు. ‘సర్జరీ అంటున్నారు... ఎలా చేస్తారో ఏంటో’ అనే బెంగా అక్కర్లేదు. ఎందుకంటే ఇక్కడ కంటి పరీక్షల దగ్గర్నుంచి, సర్జరీల వరకూ అన్నీ ఉచితం, అది కూడా అత్యాధునిక టెక్నాలజీతో- కాబట్టి ఎలా చేస్తారో అన్న చింత వదిలేయొచ్చు. అనేక అనుమానాలతో బస్సు దిగిన వాళ్లంతా సరిగ్గా మూడురోజులకి చక్కని కంటి చూపుతో, భవిష్యత్తు మీద భరోసాతో అదే బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. ఇలా చుట్టుపక్కల గ్రామాల నుంచి కంటి వైద్యం అవసరమైన పేదలని తీసుకురావడం, చక్కని వైద్యం అందించి తిరిగి వారివారి గ్రామాల్లో వదిలిపెట్టడం ఈ ఆసుపత్రికి కొత్తేం కాదు, 36 ఏళ్లుగా అక్కడకు వచ్చే రోగులు మారుతున్నారే కానీ, ఆ ఆసుపత్రి ఆశయంలో మాత్రం ఏ మార్పూ లేదు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తూ... సుమారు తొమ్మిది లక్షలమందికి ఉచిత కంటి వైద్యం అందించిన ఈ ఆసుపత్రి ప్రయాణం ఎక్కడ మొదలైందంటే....



ఒక డాక్టర్ ఆశయంతో....

మందులతో కన్నా ఓ మంచిమాటతో పేషెంట్ జబ్బుని నయం చేయడం తేలికవుతుందని నమ్మే వ్యక్తి డాక్టర్ భాస్కర్ మాడేకర్. కరీంనగర్‌లోని తన ఆసుపత్రికి వచ్చే రోగుల కష్టసుఖాలని అడిగి తెలుసుకునేవారాయన. ఆ క్రమంలోనే ‘కంటి చూపు’ తగ్గి ఆసుపత్రి వరకూ రాలేకపోతున్న గ్రామీణుల కష్టాలు ఆయన్ని ఆలోచింపజేశాయి. ఆయన లయన్స్ క్లబ్ సభ్యుడు. పేదల కోసం ఉచిత కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తే బాగుంటుందన్న విషయాన్ని తన స్నేహితుడు బొమ్మ వెంకటేశ్వర్లుతో పంచుకున్నాడాయన. వీరి ఆలోచనకు అప్పటి కలెక్టర్ అండగా నిలబడి మూడెకరాల ప్రభుత్వ భూమిని ఆసుపత్రి కోసం కేటాయించారు. అలా 50 పడకలతో, 1988లో... లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్- డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉచిత కంటి ఆసుపత్రి సేవా ప్రయాణం మొదలయ్యింది. అది మొదలు ఇప్పటి వరకూ దాదాపు తొమ్మిది లక్షలమందికి కంటి వైద్యం అందిస్తే, అందులో లక్షన్నరమంది ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించుకున్నారు.

ఊరికి బస్సు వస్తుంది...

రేకుర్తి ఆసుపత్రి వైద్య సిబ్బంది వారంలో మూడు రోజులు గ్రామాలకు వెళ్లి వైద్య శిబిరాల్ని నిర్వహిస్తారు. గ్లకోమా, క్యాటరాక్ట్, డయాబెటిక్ రెటినోపతి, మెల్లకన్నుతోపాటు వివిధ రకాల దృష్టి సమస్యలతో బాధపడుతున్నవారిని గుర్తించి బస్సులో వారందరినీ ఆస్పత్రికి తీసుకొస్తారు. వారిలో అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తారు. అంతవరకూ వసతి కల్పించి కళ్లద్దాలు అందించి, ఇంటికి తీసుకెళ్లి వదిలేంతవరకూ బాధ్యత తీసుకుంటారు. ఇలా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకూ సుమారు పదివేల వైద్య శిబిరాల్ని ఏర్పాటు చేసిందీ ఆసుపత్రి. అలాగే ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లి అక్కడ పిల్లల్లో దృష్టి లోపాలుంటే గుర్తించి వారికీ వైద్యం అందిస్తోంది. ‘ఇవన్నీ చేయడానికి లయన్స్ క్లబ్ నుంచీ, ఇతర దాతల నుంచీ, డిస్ట్రిక్ట్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ నుంచీ మాకు నిధులు అందుతాయి. వాటి సాయంతోనే పేదవారికి ఉచిత వైద్యం అందిస్తున్నాం. అలాగే ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థల సాయంతో బస్సులు కొని గ్రామాల్లో పర్యటిస్తున్నాం. హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా కోట్ల రూపాయల విలువ చేసే ఆధునిక వైద్య ఉపకరణాలు కొని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా స్థానికులకు వైద్యం చేస్తున్నాం’ అంటున్నారు సంస్థ ఛైర్మన్ కొండా వేణుమూర్తి. ఇక్కడ పేదవారే కాదు ఎవరైనా నామమాత్రపు రుసుముతో సర్జరీ చేయించుకోవచ్చు. ఇలాంటి సంస్థలని చూసినప్పుడు మనకూ ఎంతో కొంత సాయం చేయాలనిపించడం సహజం కదా. అలాంటి వారికోసం ఇక్కడ ‘నేత్రజ్యోతి’ అనే పథకం ఉంది. పెళ్లిరోజు, పుట్టినరోజుల్లాంటి సందర్భాలలో- మనకు తోచిన సాయం చేస్తే ఆ డబ్బుతో మన పేరు మీద పేదలకు వైద్యం అందిస్తుందీ ఆసుపత్రి.

– తుమ్మల శ్రీనివాస్, ఈనాడు, కరీంనగర్
ఫొటోలు: టి.మోహన్

పరిశోధన



కాలేయానికి... కప్పున్నర కాఫీ!

ఔను... రోజుకో కప్పున్నర కాఫీ తాగితే కాలేయ సమస్యలకి దూరంగా ఉండొచ్చట. ముఖ్యంగా, కాలేయ వాపు (లివర్ ఫైబ్రోసిస్) వంటి ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చట. కాక పోతే, ఆ కాఫీని ఓ మందులాగే తాగాలని చెబుతున్నారు శాస్త్ర వేత్తలు. అంటే చక్కెర జోలికి వెళ్లకుండా ఉండాలట. పాలు కూడా చాలా తక్కువగానే వాడాలట! అమెరికాలోని సౌత్ ఈస్టర్న్ యూనివర్సిటీ(ఎస్ఈయూ)కి చెందిన శాస్త్రవేత్తలు కాఫీలోని కెఫిన్‌కీ లివర్ ఫైబ్రోసిస్ సమస్యకీ మధ్య ఉన్న సంబంధంపైన సుదీర్ఘ పరిశోధన చేశారు. సుమారు 23 వేల మందిని ఇందుకోసం పరిశీలించారు. సాధారణంగా కామెర్లు, మద్యపానం అలవాటు ఉన్నవాళ్లలో కాలేయంలోని టిష్యూలు దెబ్బతింటాయి. మధుమేహ బాధితుల్లోనైతే కాలేయంలో కొవ్వు పెరిగి ఇదే సమస్య తలెత్తుతుంది. అలా దెబ్బతిన్న టిష్యూల స్థానాన్ని కొలాజెన్ అనే ఫైబర్ కణాలు ఆక్రమిస్తాయి. అవి అప రిమితంగా పెరిగి... కాలేయవాపు సమస్య వస్తుంది. కానీ కాఫీ లోని కెఫిన్... ఈ ఫైబర్ కణాల ఉత్పత్తిని అడ్డుకుని కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుతోందని ఈ పరిశోధకులు గుర్తించారు. కాకపోతే, కాఫీ మితంగానే తాగాలంటున్నారు. కప్పున్నర మించితే గుండెకొట్టుకునే వేగం పెరగడంతోపాటు, యాంగ్జైటీ సమస్యలూ రావొచ్చని హెచ్చరిస్తున్నారు.

భోజనంతోపాటే నిమ్మ రసమూ!

మధుమేహం ఉన్నవాళ్లని అన్నం, బ్రెడ్డు వంటి పిండి పదార్థాలు(కార్బోహైడ్రేట్స్) తక్కువగా తీసుకోమంటారు కదా! ఈ పదార్థాలు రక్తంలోని చక్కెర స్థాయుల్ని ఒక్కసారిగా పెంచుతాయనే ఇలా చెబుతుంటారు. కానీ, చిన్నప్పటి నుంచీ అలవాటు కావడం వల్లనో, రుచిగా అనిపించడం వల్లనో డాక్టర్లు వద్దని చెప్పినా అన్నం తినేస్తుంటారు. అలాంటప్పుడు భోజనంతోపాటూ కాస్త నిమ్మ రసమూ తీసుకోవాలంటున్నారు పరిశోధకులు. అది చక్కెర స్థాయి వేగంగా పెరగకుండా 30 శాతం తగ్గిస్తుందని చెబుతున్నారు ఫ్రాన్స్‌లోని ప్యారిస్ సాక్లే యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. అన్నం, బ్రెడ్డు, ఉడికించిన బంగాళాదుంపలు వంటివి తిన్నప్పుడు కేవలం 40 నిమిషాల్లోనే మన శరీరంలోని చక్కెర శాతం పెరుగుతుందట. అదే నిమ్మరసంతోపాటూ తీసుకున్నప్పుడు 85 నిమిషాలకిగాని ఆ పెరుగుదల ఉండదట. అదీ మెల్లగా ఓ క్రమపద్ధతిలోనే ఉంటోందట. ఆ ఆలస్యం జీవక్రియ మెరుగ్గా పనిచేయడానికి దోహదపడుతుందని చెబుతున్నారీ శాస్త్రవేత్తలు. నిమ్మరసంలోని యాసిడ్లే ఈ ప్రక్రియని ఆలస్యం చేస్తున్నాయని వివరిస్తున్నారు. అన్నట్టు, ఆ నిమ్మరసాన్ని చక్కెర, తేనె వంటివి లేకుండానే తీసుకోవాలట.



చాక్లెట్‌తో... అల్సర్ హుష్!



ఔను... చాక్లెట్‌తో ఒక్క అల్సరే కాదు... ఆ అల్సర్ ముదిరితే వచ్చే ఉదర క్యాన్సర్‌కీ చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. మామూలుగా పేగుపూత(అల్సర్) సమస్యకి హెచ్.పైలోరి అనే బ్యాక్టీరియానే కారణమవుతూ ఉంటుంది. ఇది ఒక్కోసారి ఉదర క్యాన్సర్‌కీ దారితీస్తుంది. ఆ బ్యాక్టీరియాని అరికట్టే రకరకాల యాంటీబయాటిక్స్ ఉన్నాయి కానీ... ఈ బ్యాక్టీరియా ఆ మందుల్నీ ఎదుర్కొనే శక్తిని సంతరించుకుని మరింత మొండిగా తయారవుతోందట. ఈ నేపథ్యంలోనే ఆ మందులకి సాయపడే ఆహారపదార్థాలపైన దృష్టిపెట్టారు చిలీ దేశంలోని క్యాథలిక్ యూనివర్సిటీ ఆఫ్ ది మౌలేకి చెందిన పరిశోధకులు. సాధారణంగానే చాక్లెట్ మూలపదార్థమైన కొకోవాలో బ్యాక్టీరియాని ఎదుర్కొనే ఫ్లవనాయిడ్స్ పుష్కలంగా ఉంటాయట. దాంతోపాటూ ద్రాక్ష గింజలూ, తొక్కల్లోనూ బ్యాక్టీరియాని నిర్మూలించే గుణాలున్నాయట. ఈ శాస్త్రవేత్తలు కొకోవా ఫ్లవనాయిడ్స్‌కి ఇలా ద్రాక్షలోని భాగాల్ని కలిపి... సరికొత్త చాక్లెట్‌ని రూపొందించారు. ఇది హెచ్.పైలోరి బ్యాక్టీరియాని సమర్థంగా అడ్డుకుంటోందని అంటున్నారు. ఇది మందులకి ప్రత్యామ్నాయం కాకపోయినా... అనుబంధ ఔషధంగా అద్భుతాలే చేయగలదని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

పక్కనా వెలుగుండాలి...!

ప్రపంచంలో హ్రస్వదృష్టి(మయోపియా) నానాటికీ పెరుగుతూ ఉంది. దూరంలో ఉన్న వస్తువుల్ని చూడలేని ఈ సమస్య... ఆసియా దేశాల్లో 90 శాతంమందిలో ఉంటోందని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. ఇందుకు కారణం - రోజురోజుకీ స్క్రీన్‌టైమ్ పెరగడమేనని ఇంతకాలం భావిస్తూ వచ్చారు పరిశోధకులు. కానీ తెరను-ముఖ్యంగా మొబైల్‌ను చూసేటప్పుడు... చుట్టూ ఉన్న చీకటి లేదా తక్కువ వెలుగు కూడా ఇందులో కీలకపాత్ర పోషిస్తోందని చెబుతున్నారు న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు. మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌ని చూసేటప్పుడు మన కంటిపాప తీక్షణత కోసం చిన్నదవుతుంది(సంకోచిస్తుంది). కానీ చుట్టూ చీకటి లేదా తక్కువ వెలుగు ఉన్నప్పుడు ఆ సంకోచించడం మరీ ఎక్కువగా ఉంటుందట. అలా ఎక్కువసేపు సంకోచించే ఉండటం వల్లే... హ్రస్వదృష్టి సమస్య ఎక్కువవుతోందని గుర్తించారట ఈ శాస్త్రవేత్తలు. చుట్టూ కాస్త వెలుగు ఉన్నప్పుడో లేదా ఆరుబయటో స్క్రీన్ చూసేవాళ్లలో ఆ సమస్య చాలా తక్కువట. కాబట్టి, రాత్రిళ్ళు అదీ చీకట్లో ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌ని చూడటం వీలున్నంత వరకూ మానేయడం మంచిదని చెబుతున్నారు. మరీ తప్పదనుకున్నప్పుడు లైటువేసే ఆ పని చేయడం మేలంటున్నారు. అంతేకాకుండా, వైద్యుల సలహాతో కంటిపాప సంకోచాన్ని నిలువరించే కాంట్రాస్ట్ రిడక్షన్ లెన్స్‌లనీ ఉపయోగించాలని సూచిస్తున్నారు.





మాయమైపోతున్నాడు...
మనసున్నవాడు!

కళ్లప్పగించి చూస్తారు. కలికాలమని శాపాలు పెడతారు. ప్రభుత్వాలదే తప్పని దుమ్మెత్తి పోస్తారు. రీల్స్‌తో రాద్ధాంతం చేస్తారు. అంతేకానీ... సాటి మనిషికి సాయపడాలనో, సకాలంలో వైద్యం అందించాలనో పొరపాటునైనా ఆలోచించరు. ఎందుకింత స్పందనారాహిత్యం, ఏమైపోతోంది మానవత్వం?

హైదరాబాద్.
అమీర్‌పేట బస్‌స్టాప్.

ఓ నిరుపేద యువతి భుజాన పసిబిడ్డను వేసుకుని నిలోఫర్ హాస్పిటల్ వైపు వెళ్లే సిటీబస్సు కోసం ఎదురుచూస్తోంది. అప్పటికే చిన్నారి శరీరం నిప్పుల కుంపటిలా కాలిపోతోంది. అంతలోనే బస్సు వచ్చింది. ఎక్కి కూర్చుందామె. కండక్టరు తన సీటు దగ్గరికి రాగానే, ఆధార్ కోసం బ్యాగులో చేయి పెట్టింది. ఎంత వెతికినా కనిపించలేదు. ఎక్కడో పడిపోయిందని అర్థమైపోయింది. టికెట్ తీసుకుందామంటే, చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. ఇబ్బంది పడుతూనే తన పరిస్థితిని వివరించింది. 'కుదర్దమ్మా! ముందు చెకింగ్ ఉంది' అంటూ బస్సు ఆపించాడు కండక్టర్. మండుటెండలో, నడిరోడ్డు మీద దిగిపోయిందామె. బస్సులో పాతికమంది వరకూ ఉన్నారు. ఒక్కరైనా, 'పోన్లే, నేను టికెట్ తీసుకుంటాను' అనలేకపోయారు. డబ్బు లేక కాదు, మనసు రాక!

★ ★ ★

బెంగళూరు.
బనశంకరి ప్రాంతం.

ఎప్పట్లానే ట్రాఫిక్ తీవ్రంగా ఉంది. సిగ్నల్స్ దగ్గర మరింత మెల్లగా కదులుతోంది. హఠాత్తుగా, ఓ వాహనదారుడు గుండె నొప్పితో ఫుట్‌పాత్ మీద కుప్పకూలి పోయాడు. పక్కనే ఉన్న భార్యకు ఏం చేయాలో తోచలేదు. అటుగా వెళ్తున్నవారిని 'హెల్ప్... హెల్ప్' అని ప్రాధేయపడింది. కొందరు, తలతిప్పి కూడా చూడలేదు. ఇంకొందరు, చూసినా చూడనట్టే వెళ్లిపోయారు. ఓ గుండె ఆగిపోయిందే కానీ, ఏ ఒక్కరి గుండే కరగలేదు!

★ ★ ★

బిహార్.
సీతామర్హి జిల్లా, ఝూజిహాట్ గ్రామం.

రితేష్‌కుమార్ అనే ఏడో తరగతి విద్యార్థి సైకిల్ మీద బడికెళ్తున్నాడు. అతివేగంగా వస్తున్న ఓ చేపల ట్రక్కు, రోడ్డు దాటుతున్న ఆ పసివాడిని గుద్దేసింది. దెబ్బకు శరీరం ఛిద్రమైపోయింది. అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు రితేష్. అదుపుతప్పిన ట్రక్కు రెండుమూడు పల్టీలు కొట్టింది. దీంతో, వాహనంలోని సరుకంతా నేలపాలైంది. ఐదు నిమిషాల్లో జనం పోగైపోయారు. రోడ్డు మీద పడున్న చేపల్ని ఆబగా ఏరుకుని, సంచుల్లో నింపుకున్నారు. కాసేపటి తర్వాత, అక్కడ ఒక్క చేపా మిగల్లేదు... ఆ పసివాడి శవం మాత్రమే ఉంది!

★ ★ ★

ముంబయి.
బాంద్రా రైల్వేస్టేషన్.

లోకల్ ట్రైన్ కదులుతున్న సమయానికి నలుగురు కుర్రాళ్లు ఎక్కారు. అప్పటికే, తాగినట్టున్నారు. గుప్పుమంటూ మద్యం వాసన. వాళ్ల దృష్టి కిటికీ పక్క సీట్లో కూర్చున్న కాలేజీ అమ్మాయి మీద పడింది. ఆమె ఒంటి కొలతల గురించి మాట్లాడు కోవడం మొదలుపెట్టారు. ఆ కామెంట్లు హద్దులు దాటిపోయి, బూతుల స్థాయికి చేరుకున్నాయి. కాసేపు సహనంతో వ్యవహరించినా, ఆ తర్వాత తట్టుకోలేక పోయింది. 'పోలీసులకు కంప్లైంట్ చేస్తా', 'టీసీ దృష్టికి తీసుకెళ్తా'... అని గట్టిగానే హెచ్చరించింది. 'ఏం చేసుకుంటావో చేస్కో' అంటూ పగలబడి నవ్వసాగారు. మాటసాయం కోసం చుట్టుపక్కల వారివైపు చూసింది. ఎవరి ప్రపంచంలో వాళ్లున్నారు. ఒకరిద్దరైనా తలెత్తి చూడలేదు. అంతమంది పోకిరీలతో ఒంటరిగా పోరాడలేనని అర్థమైపోయింది. కన్నీళ్లు తుడుచుకుంటూ పక్క స్టేషన్‌లో దిగిపోయింది. ఆ దుర్మార్గుల మాటల కంటే, తోటి ప్రయాణికుల మౌనమే ఎక్కువ బాధించి ఉంటుంది!

★ ★ ★

స్పందించరు.
ప్రశ్నించరు.
జోక్యం చేసుకోరు.

...కళ్లముందే ప్రాణాలు పోతున్నా, పక్కనే కొంపలు తగలబడిపోతున్నా, నడివీధిలో మానవత్వం మంటగలుస్తున్నా! 'అర్జెంటుగా ఆఫీసుకు వెళ్లాల్సిన పని. ఏ ఆదివారమో అయితే సాయం చేసేవాణ్నే!', 'కాయగూరలు కొనుక్కుని వెళ్తుంటే, ఆ ఘోరం కంటబడింది. సరుకుల సంచి చేతిలో లేకపోతేనా...', 'రక్తం అంటే భయం నాకు. అందుకే, అటువైపు తొంగి కూడా చూడలేదు!', 'మా నాన్నకు యాక్సిడెంట్ అయినప్పుడు ఒక్కరూ సాయం చేయలేదు. దీంతో మనుషుల మీద నమ్మకం పోయింది!', 'ఆటోలో హాస్పిటల్‌కు తీసుకెళ్లడానికి ఐదొందలైనా అడుగుతారు, అసలే కష్టాల్లో ఉన్నా!'... ఇలా ఎవరి సాకులు వారివి, ఎవరి పలాయనవాదం వారిది. మన సమస్యలు మనకుంటాయి. మన పరిమితులు మనల్ని వెనక్కి లాగుతుంటాయి. అయినా సరే, వెన్ను చూపకూడదు. స్పందించాల్సిన



సమయంలో స్పందించని మనిషి కోమాలో ఉన్న రోగితో సమానం.

బైస్టాండర్ ఎఫెక్ట్

నోయిడాలో ఓ ఐటీ ఉద్యోగి అర్ధరాత్రి ఆఫీసు నుంచి ఇంటికెళ్తూ, వాటర్‌బోర్డు వాళ్లు తవ్విన గోతిలో పడిపోయాడు. బెంగళూరులో ఓ చిన్నారి ఆడుకుంటూ ఆడుకుంటూ మూతలేని మ్యాన్‌హోల్‌లో చిక్కుకు పోయింది. చెన్నైలో ఓ యాచకుడు వేలాడుతున్న విద్యుత్ తీగల్ని పట్టుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ గొయ్యి ఆరోజే తవ్వింది కాదు. ఆ మ్యాన్‌హోల్ మూత అప్పటికప్పుడు మాయం కాలేదు. ఆ కరెంటు తీగ ఉన్నపళంగా తెగిపడనూలేదు. ఎప్పటి నుంచో ఉన్న సమస్యలే అవన్నీ. చాలామంది పద్దాకా లేచారూ. కానీ, ఒక్కరు కూడా స్పందించలేదు. శాశ్వతంగా పరిష్కరించే ప్రయత్నమూ చేయలేదు. ఇలాంటి ప్రమాదాలు సామూహిక నేరాలు, సామాజిక దౌర్భాగ్యాలు. చాలా సందర్భాల్లో 'నేనే ఎందుకు చొరవ తీసుకోవాలి?'... అనే అర్థంలేని ప్రశ్న మనలోని చొరవ మీద నీళ్లు చల్లుతుంది. దీన్నే మానసిక నిపుణులు 'బైస్టాండర్ ఎఫెక్ట్' అంటారు. మనిషి స్వభావమే అంత. ఒక్కడే ఉన్నప్పుడు ఒకలా ఉంటాడు, గుంపులో భాగమైనప్పుడు ఇంకోలా వ్యవహరిస్తాడు. 'ఇంతమంది ఉన్నారు. ఎవరో ఒకరు చూసుకుంటార్లే!' అని తప్పించుకుంటాడు. 'చూద్దాం. ఇంకెవరైనా ముందుకొస్తే మనమూ ఓ చేయివేద్దాం!' అని రాజీపడిపోతాడు. అనగనగా కథలోని రాజుగారి పాలకుండ మొత్తంగా నీళ్లతోనే నిండిపోడానికి కూడా, ఆ రాజ్యంలోని బైస్టాండర్ ఎఫెక్టే కారణం. ఈ నిర్లిప్తత మూలాలు మన పెంపకంలోనే ఉన్నాయంటారు మానసిక నిపుణులు. మన పిల్లాడు క్లాస్‌రూమ్‌లో సందేహాల మీద సందేహాలు అడుగుతున్నట్టు క్లాస్ టీచర్ నుంచి ఫోన్ రాగానే, 'అతితెలివి చూపొద్దు' అని హెచ్చరిస్తాం. దీంతో, ఆ పసిబుర్రలోని ప్రశ్న చచ్చిపోతుంది. తోటి విద్యార్థికి నోట్‌బుక్ ఇవ్వబోతే, 'ముందు నీ సంగతి చూసుకో' అంటూ నిరుత్సాహ పరుస్తాం. ఆ దెబ్బకు సాయపడే గుణం అటకెక్కుతుంది. ఏ ఎన్‌సీసీలోనో చేరతానని బతిమాలినప్పుడు, 'బుద్ధిగా చదువుకోవాలని లేదా?' అని చివాట్లేస్తాం. ఇంకేముంది, సామాజిక బాధ్యతా అడుగంటుతుంది. అందులోనూ, కన్నబిడ్డల ప్రతి కదలికనూ శాసించాలనుకునే 'హెలికాప్టర్ పేరెంటింగ్' విధానం స్పందించే గుణాన్ని మొగ్గలోనే తుంచేస్తుంది. దీంతో, బాధ్యతను భయం ఆక్రమిస్తుంది. చొరవను స్వార్థం మింగేస్తుంది. కాబట్టి, బాల్యం నుంచే వాళ్లకు స్పందించడం నేర్పాలి. ఏ విషయంలో అయినా సానుకూలంగా స్పందించినప్పుడు హృదయపూర్వకంగా ప్రశంసించాలి, భుజంతట్టి ప్రోత్సహించాలి. ఆ అర్హత వాళ్లు డాక్టర్లూ ఇంజినీర్లూ అవడానికి ఉపయోగపడకపోవచ్చు. కానీ, నిజమైన మనుషులు అవుతారు. 'బైస్టాండర్ ఎఫెక్ట్' బారిన పడకుండా ఉంటారు.

అర్థంలేని భయాలు

ప్రాణాంతక పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైందే. ప్రతి ప్రయత్నం అమూల్యమైందే. 'గోల్డెన్ అవర్'లోగా నాణ్యమైన చికిత్స అందితే ఓ ప్రాణం నిలబడుతుంది. ఓ కుటుంబం నిశ్చింతగా నిద్రపోతుంది. కానీ పోలీసు కేసులూ, కోర్టు వాయిదాలూ ఎంతోకొంత బాధ్యత కలిగిన పౌరుల్ని సైతం అడుగు ముందుకేయకుండా నిలువరిస్తున్నాయి. అయినా, చిన్నాచితకా సమస్యలకు భయపడిపోయి, నిస్సహాయస్థితిలో ఉన్న వ్యక్తిని అలానే వదిలేస్తామా? అదే జరిగితే, లోకుల కంటే కాకులే నయం అనే మచ్చ వచ్చేయదూ! ఇలాంటి సమయాల్లో సహానుభూతికి కాస్తంత లౌక్యమూ జోడించాలి. దాంతోపాటే, చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలి. ప్రత్యేకించి, భారతీయ మోటారు వాహనాల చట్టం ప్రాణదాతకు రక్షణగా నిలుస్తోంది. సాక్ష్యం చెప్పమనో, స్టేట్‌మెంట్ రికార్డు చేయమనో పోలీసులు బలవంతం చేయకుండా అడ్డుకుంటోంది. మాటిమాటికీ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఒక్కసారి వాంగ్మూలం నమోదు చేసినా సరిపోతుందని హామీ ఇస్తోంది. క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించే సమయంలో, మరీ అత్యవసరమైతే తప్పించి వ్యక్తిగత వివరాల్ని వెల్లడించాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తోంది. అయినా కూడా, ఎవరైనా కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తే నేరుగా జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయవచ్చని ధైర్యం చెబుతోంది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వ రహ-వీర్ (రహదారి వీరులు) పథకం... ప్రాణదాతలకు అభినందన పత్రంతోపాటూ పాతికవేల రూపాయల ప్రోత్సాహక బహుమతినీ అందిస్తోంది. ఇది ప్రాణానికి కట్టిన విలువ కాదు, మనిషి చొరవకు గుర్తింపు, మానవీయ స్పందనకు సగౌరవ వందనం!

సహజగుణం!

స్పందన... మనిషితనంలో ఓ భాగం. గుండెల్లో ఎంతోకొంత తేమ ఉన్న ప్రతివ్యక్తీ ఎవరికి ఏ సమస్య ఎదురైనా, తనకే వచ్చినట్టు కదిలిపోతాడు, కరిగిపోతాడు. పరిష్కారాలూ వెదుకుతాడు. ఆ ప్రయత్నంలో మెదడులోని 'న్యూరోఇమేజింగ్' వ్యవస్థ తనవంతు సాయం అందిస్తుందనీ, కొత్త ఆలోచనల్ని ప్రసాదిస్తుందనీ అంతర్జాతీయ అధ్యయనాల్లో వెల్లడైంది. అలాంటి మానవీయ స్పందనల్లోంచి అనేక సామాజిక

'క్లిక్'టివిజం...

పుణె శివార్లలో ఓ పన్నెండేళ్ల పసివాడు చెరువులో పడిపోయాడు. సాయం కోసం చేతులు ఊపుతున్నా... ఎవరూ కాపాడే ప్రయత్నం చేయలేదు. ఎవరికివారు ఆ సంఘటనను ఫోన్‌లో రికార్డు చేసుకునే పనిలో ఉన్నారు. ఒక్కరు మాత్రం, ప్రభుత్వ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేశారు. అది కూడా, 'రీల్'లో భాగంగానే. అప్పటికే ఆలస్యమైపోయింది. జరగాల్సిన నష్టమంతా జరిగిపోయింది. ఇలాంటి డిజిటల్ శూరత్వాలు... అచ్చంగా క్రూరత్వాలే! ప్రతి సంఘటననూ లైక్స్‌లో లెక్కించడం అలవాటైపోయాక కళ్లముందు జరిగే ప్రమాదాలూ, నడిరోడ్డు సాక్షిగా జరిగే అన్యాయాలూ... సోషల్ మీడియా పోస్టులకే పరిమితం అవుతున్నాయి. రెండు కన్నీటి చుక్కలు రాల్చడంతో, నాలుగు బరువైన డైలాగులు వల్లించడంతో తమ పని అయిపోయినట్టు భావిస్తున్నారు డిజిటల్ పౌరులు. అది బాధ్యత తీరిపోవడం కాదు, బాధ్యత నుంచి తప్పించుకోవడం!



ఆవిష్కరణలూ, సేవా సంస్థలూ పుట్టుకొచ్చాయి. "నేను మధ్యప్రదేశ్‌లోని మారుమూల గ్రామంలో పుట్టాను. ఏ వసతులూ లేని సర్కారు బడిలో చదువుకున్నాను. మా క్లాస్‌లో ఓ విద్యార్థి ఎప్పుడూ డుమ్మా కొట్టేవాడు. టీచరు తిట్టినా, హెడ్‌మాస్టరు హెచ్చరించినా పట్టించుకునేవాడు కాదు. కానీ తను చాలా తెలివైనవాడు. ఆ గైరుహాజరుకు ఏదో బలమైన కారణం ఉందనిపించేది. ఓ ఆదివారం ఆ కుర్రాడి ఇంటిని వెతుక్కుంటూ వెళ్లాను. నిజానికి అది పూరిగుడిసె. ఆ వాతావరణాన్ని చూడగానే కుటుంబ పరిస్థితి అర్థమైపోయింది. వాళ్ల నాన్న చర్మకారుడు. అతని ఆరోగ్యమూ అంతంతమాత్రంగానే ఉండేది. దీంతో తరచూ నా మిత్రుడే దుకాణానికి వెళ్లాల్సి వచ్చేది. చిన్న వయసులోనే శక్తికి మించిన భారం మోసేవాడు పాపం! అప్పటికప్పుడు తనకు ఏ సాయమూ చేయలేకపోయినా, ఆ చేదు జ్ఞాపకం నన్ను ఆ తర్వాత కూడా వెంటాడింది. సేవారంగంలోకి ప్రవేశించాక, 'బాలగ్రామ్' ఏర్పాటు దిశగా అడుగులు వేయించింది" అంటూ తన తాజా పుస్తకం 'కరుణ... పవర్ ఆఫ్ కంపాషన్'లో చిన్నప్పటి అనుభవాన్ని పంచుకున్నారు కైలాష్ సత్యార్థి. ఓ స్నేహితుడి సమస్యకు ఆయన స్పందన... లక్షలమంది బాలకార్మికుల జీవితాలను మార్చేసింది. నోబెల్ విజేతనూ చేసింది. హృదయపూర్వక స్పందనల్లోంచి పుట్టుకొచ్చిన ఆవిష్కరణల సంఖ్యా తక్కువేం కాదు. సరిహద్దుల్లో సైనికుల వీర మరణాల గురించి చదివిన ప్రతిసారీ, దిల్లీకి చెందిన అర్జున్ అగర్వాల్ గుండె కుతకుతా ఉడికిపోయేది. ఆ ఆవేశమే తనని 'ఏరోఆర్క్' అనే స్టార్టప్‌కు యజమానిని చేసింది. సున్నిత ప్రాంతాల్లో జవాన్లకు బదులుగా పహరా కాసే రోబోలను సృష్టించేలా ప్రోత్సహించింది. పుణె యువకుడు రాహుల్ బకారే మెకానికల్ ఇంజినీరింగ్ చదివాడు. సొంతూరికి వెళ్లిన ప్రతిసారీ, చుట్టుపక్కల పొలాల్లోని ఎండిపోయిన బోరుబావులు తనను చూసి వెక్కిరిస్తున్నట్టు అనిపించేది. ఆ కదిలిపోయే గుణమే ఆ యువ ఇంజినీర్‌తో 'బోర్ రీఛార్జర్'ను తయారు చేయించింది. ముంబయి వీధుల్లో చక్రాల కుర్చీల మీద ఇబ్బందిగా ప్రయాణిస్తున్న వికలాంగులు తారసపడినప్పుడు, సందీప్ తల్వార్‌లోని ఆవిష్కర్తకు 'నియోబోల్ట్' ఆలోచన వచ్చింది. దీన్ని వీల్‌చెయిర్‌కు జోడిస్తే, క్షణాల్లో త్రిచక్రవాహనంగా మారిపోతుంది. భారతీయ అంకుర సంస్థల గెలుపు కథలను తిరగేస్తే ఇలాంటి ఉదాహరణలు అనేకం కనిపిస్తాయి. మెదడులోంచి పుట్టిన ఆవిష్కరణలకంటే, గుండెల్లోంచి పొంగుకొచ్చినవే... కలకాలం నిలుస్తాయి.

మనసుకు చికిత్స...

అపరిచితుల వరకూ ఎందుకు? అయినవారి విషయంలోనూ అంతే నిర్దయగా ప్రవర్తిస్తున్నారు చాలామంది. పట్నాలో జరిగిన ఓ దురదృష్టకర సంఘటనలో... కళ్లముందే భార్య ఒంటిమీద డీజిల్ పోసుకుని నిప్పంటించుకుంటున్నా, కట్టుకున్న మొగుడు కాపాడే ప్రయత్నం చేయలేదు. ఆ సమయంలో అతను, భార్య ఆత్మహత్యకు తాను కారణం కాదని నిరూపించుకోడానికి ఆ ఘోరాన్ని వీడియో తీస్తున్నాడు. నిజానికి మనుషుల స్పందనారాహిత్యం సమాజం దగ్గరో, కుటుంబంతోనో ఆగిపోవడం లేదు. చివరికి తన సమస్యలకు తానే స్పందించడం మానేస్తున్నాడు. చేజేతులా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు, తెలిసితెలిసీ ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటున్నాడు. బంధాల విషయంలోనూ అంతే నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నాడు. ఈ జడత్వానికి సామాజిక చొరవ ఓ థెరపీలా పనిచేస్తుందంటారు హార్వర్డ్ శాస్త్రవేత్తలు. ఎవరినైనా కాపాడినప్పుడు, ఓ నిండు జీవితాన్ని నిలబెట్టామనే ఆలోచన ఎంతో సంతృప్తిని ఇస్తుంది. ఎవరికైనా సాయం చేసినప్పుడు, ఓ సమస్యను సమర్థంగా పరిష్కరించిన అనుభవం అంతులేని ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదిస్తుంది. నలుగురి ప్రశంసలూ, కృతజ్ఞతలూ మనసులో ఏ మూలనో గూడుకట్టుకుని ఉన్న నెగెటివ్ భావనల్ని తరిమేస్తాయి. దాంతోపాటే, సమాజం పట్ల ఉన్న నిర్లిప్తతా తొలగిపోతుంది. నేరుగా సాయం చేయడమే కాదు... ఎవరో, ఎవరికో సాయపడుతున్న దృశ్యాన్ని చూసినప్పుడు కూడా మెదడులో పాజిటివ్ ప్రకంపనలు కలుగుతాయి. కొన్నేళ్ల క్రితం, తీవ్ర నిస్పృహలో ఉన్న ఓ తైవానీ యువతి కాస్తంత మార్పు కోసం భారత పర్యటనకు వచ్చింది. అప్పటికే తను అనుభవించాల్సిన కష్టాలన్నీ అనుభవించింది. దీంతో సమాజం పట్ల కసితో రగిలిపోయేది. ఓసారి తన కళ్లముందే ఓ పసివాడిని గుర్తు తెలియని వాహనం గుద్దేసింది. అయినా ఆమెకు స్పందించాలని అనిపించలేదు. పట్టనట్టు ముందుకెళ్లబోయింది. అంతలోనే ఓ వికలాంగుడు ఒంటిచేత్తోనే ఆ బాలుడిని ఒళ్లోకి తీసుకున్నాడు. తన ఒంటి మీది చిరుగుల చొక్కాతో కట్టుకట్టి రక్తస్రావాన్ని అరికట్టాడు. అటుగా వచ్చిన అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆ దృశ్యాన్ని చూస్తున్నంత సేపూ... ఆ యువతి కళ్లలో ధారాపాతంగా నీళ్లు. ఆమెను కమ్మేసిన కాఠిన్యం పొరలుపొరలుగా కరిగిపోయింది. 'ఏ సైకియాట్రిస్టు వల్లా కానిది... మానవత్వంతో సాధ్యమైంది. కొత్త ఆశతో మా దేశానికి తిరిగి వెళ్తున్నాను' అని డైరీలో రాసుకుందామె.

★ ★ ★

ఓ అడవి తగలబడిపోతోంది. జంతువులన్నీ తలో దిక్కుకు పరిగెడుతున్నాయి. ఓ వడ్రంగి పిట్ట మాత్రం... దగ్గర్లోని చెరువులో తన రెక్కల్ని తడుపుకుని వచ్చి... కాలిపోతున్న వృక్షాల మీద విదిలిస్తోంది. సింహానికి ఇదంతా అర్థంలేని ప్రయత్నంలా అనిపించింది. ఓ క్షణం ఆగి 'మిత్రమా! ఆ కాసిన్ని నీళ్లతో మంటల్ని ఆర్పగలననే అనుకుంటున్నావా? ఎందుకొచ్చిన గొడవ? తప్పించుకుందాం రా!' అని సలహా ఇచ్చింది.

'రాజా! వేయిమైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే ఆరంభం అవుతుంది. ఈ మహారణ్యం కూడా వెయ్యేళ్ల క్రితం, ఓ చెట్టుతోనే మొదలై ఉంటుంది. నా వంతుగా ఒక్క వృక్షాన్ని బతికించగలిగినా చాలు. అదే, కాలక్రమంలో ఓ అడవిని నిర్మిస్తుంది. ఇంతకాలం నన్ను పోషించిన వనదేవతకు కష్టకాలంతో నావంతు సాయం ఇది' అని స్థిరంగా జవాబిచ్చి, తన పనిలో నిమగ్నమైపోయిందా పిట్ట. కారణాలు ఏమైతేనేం, జనారణ్యంలో మాత్రం... ఇలాంటి స్పందన కరవైపోతోంది. ★

పరీక్షలు కదా... కొందరు పిల్లలు రేయింబవళ్లూ చదివేస్తుంటారు. ఈ నెలపాటు అన్ని పనులూ పక్కాగా పూర్తిచేస్తుంటారు. మరి ఆ క్రమశిక్షణ జీవితాంతం కొనసాగితే ఎలా ఉంటుంది... పోనీ ఓ ఐదేళ్లు ఇష్టమైన రంగంపైన ఫోకస్ చేస్తే ఏం జరుగుతుంది! శుభమ్ గుప్తా జీవితం ఇందుకు జవాబు చెబుతుంది. గత ఆరేడేళ్లుగా ఉదయం ఐదు నుంచీ రాత్రి 12 గంటలవరకూ ఒకే పనిపైన దృష్టిపెట్టాడట అతను. అదే... పదివేల రూపాయల జీతగాణ్ని 200 కోట్ల 'జెన్ జీ' దుస్తుల బ్రాండ్ 'బాంకర్స్ కార్నర్'కి అధిపతిని చేసింది!





పదివేల జీతం నుంచి రూ.200 కోట్ల దాకా!

శుభమ్... పదిహేడేళ్లదాకా 'చల్తాహై' అన్నట్టు ఉండేవాడు. తండ్రి టెక్స్‌టైల్ ప్రింటింగ్ పరిశ్రమ నడుపుతుండేవాడు. డబ్బుకి కొదవలేకపోవడంతో రోజూ స్నేహితుల్ని వెంటపెట్టుకుని పార్టీలకి వెళుతుండేవాడు శుభమ్. కానీ, ఉన్నట్టుండి అతని జీవితం తలకిందులైంది. తండ్రి వ్యాపారం అప్పుల భారంతో కుప్పకూలిపోయింది. ఫ్యాక్టరీతోపాటూ ఆస్తులన్నీ అమ్మేయాల్సి వచ్చింది... ఇంటితో సహా. అంతచేసీ రెండుకోట్ల రూపాయల అప్పూ మిగిలింది. రోడ్డున పడ్డ ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. అప్పటిదాకా బెల్లం చుట్టూ ఈగల్లా శుభమ్‌తో ఉన్న స్నేహితులందరూ ముఖం చాటేశారు. ఫీజుకీ డబ్బుల్లేక బీకామ్ మొదటి ఏడాదిలోనే చదువు మానేశాడు శుభమ్. అలా 2011లో ముంబయి నగరంలోని టెక్స్‌టైల్ షాపుల్లో పనివాడిగా చేరాడు. నెలకి పదివేల రూపాయల జీతం. ఆ షాపుల్లో పనిచేస్తున్నప్పుడే 'జెన్ జీ' ఎక్కువగా మక్కువ చూపుతున్న స్ట్రీట్‌వేర్ ఫ్యాషన్‌పైన అతని దృష్టిపడింది...

ఓ స్టార్టప్‌గా...

ఓవర్‌సైజ్ టీస్, బేబీ టీస్, ట్యాంక్ టాప్, హుడీ... ఇలా వీటన్నింటినీ 'స్ట్రీట్ వేర్' ఫ్యాషన్ అంటున్నారు. క్యాజువల్ వేర్‌కి ఇదో కొత్తకోణం అనొచ్చు. విభిన్నమైన డిజైన్‌లతో విలక్షణంగా ఉండే దుస్తులివి. కొత్తతరానికి తగ్గట్టు రకరకాల బ్రాండ్‌లతో విదేశీ కంపెనీలూ వీటిని తెస్తున్నాయి. మనదేశంలోని కొన్ని బ్రాండ్‌లు వాటిని అదే ధరలతో ఇక్కడ విక్రయిస్తున్నాయి.



అలాంటి షాపుల్లో పనిచేస్తూ వచ్చిన శుభమ్‌కి... వాటితో ఓ కొత్త బిజినెస్ చేయొచ్చన్న ఆలోచన వచ్చింది. తండ్రితో కలిసి వాటిపైన ప్రింటింగ్స్ వేసే వ్యాపారాన్ని 2015లో మొదలుపెట్టాడు. దాన్నే 'వైట్‌లేబుల్' బిజినెస్‌గా మార్చాడు. అంటే, దుస్తుల్ని వీళ్లు తయారుచేసి అందిస్తే... ఆయా కంపెనీలు వాటిపైన తమ ముద్రవేసి... బ్రాండెడ్ బట్టలుగా అమ్ముకుంటాయన్నమాట! ఆ బిజినెస్సే అప్పుల్లో ఉన్న కుటుంబాన్ని కొంతమేర గట్టెక్కించింది. అలా గార్మెంట్స్ రంగంలోకి కొత్తగా వచ్చిన స్టార్టప్‌లు అన్నింటితోనూ పనిచేశాడు శుభమ్. 2020లో తనూ అలాంటి స్టార్టప్ ఒకటి ప్రారంభించాలనుకున్నాడు. తమ అద్దె ఇంట్లోని ఓ చిన్న గదినే ఫ్యాక్టరీగా చేసుకున్నాడు. ఇద్దరు పనివాళ్లతో చిన్నగా తయారీ మొదలుపెట్టాడో లేదో శుభమ్ నెత్తిన పిడుగులా పడింది కొవిడ్ లాక్‌డౌన్...

తల్లి నగలమ్మి...

పనివాళ్లిద్దరికీ తనే భోజనం వండిపెడుతూ... పది రోజులు గడిపాడు శుభమ్. అప్పుడే ఫేస్ మాస్కులపైన అతని చూపు పడింది. తన దగ్గరున్న సామగ్రితో ఎన్-95 తరహా మాస్కుల్ని తయారుచేయడం మొదలుపెట్టాడు. చూస్తుండగానే ముంబయి ఆసుపత్రుల నుంచి వాటికి భారీ స్థాయిలో ఆర్డర్‌లు వచ్చాయి. ఆ ఉత్సాహంతో, అటు లాక్‌డౌన్ తీసేయగానే ఇటు తన కలల స్టార్టప్ పనులపైన దృష్టిపెట్టాడు. విదేశీ యువత ఎక్కువగా వాడుతున్న లాంగ్‌సైజ్ టీ షర్టుల్ని ఇక్కడా పరిచయం చేయాలనుకున్నాడు. పదేళ్ల పని అనుభవంతో వచ్చిన డిజైనింగ్ మెలకువలతో వాటిని తయారుచేసి రూ.799కే విక్రయించసాగాడు. మార్కెటింగ్ కోసం సోషల్‌మీడియాని ఆశ్రయించాడు. మొదటి వారంలో పది ఆర్డర్‌లు వస్తే... తర్వాతి వారంలో మూడొందలు వచ్చాయి. ఆ సరికొత్త స్టైల్‌కి ముంబయి యువత ఫిదా అయింది. ఓ దశలో ఇబ్బడిముబ్బడిగా ఆర్డర్‌లు వస్తే... అందుకు తగ్గ ముడిసరకు లేక... తల్లి నగల్ని అమ్మి... వాటిని సమకూర్చుకున్నాడు. కుర్రకారు అని అర్థం వచ్చేలా 'బాంకర్స్ కార్నర్' పేరుతో కొత్త వెబ్‌సైట్ తెరిచాడు. విదేశీ బ్రాండ్‌లకన్నా అతితక్కువ ధరకే తన దుస్తుల్ని ఆన్‌లైన్‌లో అమ్మసాగాడు. చూస్తుండగానే మొదటి ఏడాది(2020-21) మూడువేల ఆర్డర్‌లు వచ్చాయి... ఐదు కోట్ల రూపాయల రెవెన్యూ నమోదైంది. అదీ ప్రారంభం..!

అదే రహస్యం...

రెండో ఏడాదికి ఐదుకోట్ల రెవెన్యూ కాస్తా రూ.35 కోట్లకి చేరింది. ఆ తర్వాత 65 కోట్లు... ఇలా ఏడాదికి 20 శాతం వృద్ధితో... స్ట్రీట్‌వేర్ స్టార్టప్‌గా తిరుగులేని ప్రగతిని నమోదు చేసింది బాంకర్స్ కార్నర్. ఈ ఏడాది ఆ రెవెన్యూ సుమారు రూ.200 కోట్లకి చేరింది. రూ.300 కోట్ల మార్కెట్ వ్యాల్యూతో దూసుకెళుతోంది. ఇద్దరితో మొదలుపెట్టిన సంస్థ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దేశవ్యాప్తంగా వెయ్యిమందికి ఉద్యోగాలని ఇస్తోంది. ఈ ప్రగతి వెనక తన క్రమశిక్షణే కారణం అంటాడు శుభమ్. గత ఐదారేళ్లుగా ఉదయం ఐదు నుంచి రాత్రి పదకొండు దాకా తాను ఫ్యాక్టరీలోనే ఉండిపోయానని చెబుతాడు. మరి సరదాలూ కాలక్షేపాల సంగతేమిటీ అంటే... అవన్నీ చేసే పనిలోనే వెతుక్కుంటానని చెబుతాడు! అర్థమైందా... శుభమ్ విజయ రహస్యం?! ★



చూయింగ్ గమ్ నమిలితే నోరు తాజాగా మారుతుందని తెలుసు. కానీ అదే గమ్- నోట్లోని వైరస్‌ని చంపితే? దంతాల్ని ఆరోగ్యంగా ఉంచితే? అంతేనా... తక్షణ శక్తినిచ్చే ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తే? ఇంకా... రకరకాల పండ్లూ, కూరగాయలూ, సుగంధ ద్రవ్యాల్లాంటి రుచుల్లోనూ వస్తే? ఏమాత్రం సంకోచించకుండా ఎవరైనా సరే, ఆ హెల్దీ గమ్స్‌ని నోట్లో పెట్టుకోరూ! మార్కెట్లో దొరుకుతున్న ఆ కొత్త వెరైటీలపైన మీరూ ఓ లుక్కేయండి...





నోట్లోని వైరస్‌ను చంపే... చూయింగ్ గమ్!

చాక్లెట్లూ, పిప్పర్‌మెంట్ బిళ్లలూ నోట్లో వేసుకున్నట్టే చాలామంది చూయింగ్ గమ్‌ని కూడా తినేస్తుంటారు. ఏ పనీ తోచక కొంతమంది చూయింగ్ గమ్ నమిలితే... ఒత్తిడిని తగ్గించుకోవడానికీ, తాజా శ్వాస అనుభూతికీ మరికొంతమంది దీన్ని ఎంచుకుంటారు. అయితే నిజంగానే దీని వల్ల ఎన్నో లాభాలున్నాయని రకరకాల పరిశోధనల్లో తేలింది. చూయింగ్ గమ్ నోట్లో లాలాజలాన్ని ఉత్పత్తి చేస్తుందనీ, ఫుడ్ క్రేవింగ్స్‌ని తగ్గిస్తుందనీ, జ్ఞాపకశక్తిని పెంచుతుందనీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాకపోతే దీంట్లోని అధిక చక్కెరలూ, కృత్రిమ పదార్థాలతో కొన్నిరకాల ఇబ్బందులు ఎదురవుతాయట. అందుకే, ఆ సమస్యలకు చెక్‌పెడితే... ఎంచక్కా చూయింగ్ గమ్ పూర్తిగా హెల్దీ ఫుడ్ అవుతుందనుకున్నారేమో- పరిశోధకులు రకరకాల చూయింగ్ గమ్స్‌ని తీసుకొస్తున్నారు. ఇప్పటికే యాంటీ వైరల్ ట్రాప్ ప్రొటీన్‌తో ఉండే ల్యాబ్‌ల్యాబ్ అనే బీన్స్ పొడితో యాంటీ వైరల్ చూయింగ్ గమ్‌ను తయారుచేశారు. ఇది వైరస్‌ల్ని బంధించి శరీరం లోపలికి వ్యాప్తి చెందకుండా చూస్తుంది. ఇంకా నోట్లోని ఇన్‌ఫెక్షన్లను కనిపెట్టే 'డయగ్నోస్టిక్ గమ్', హానికరమైన బ్యాక్టీరియాని తగ్గించే 'ఓరల్ హెల్త్ గమ్', సహజసిద్ధమైన పదార్థాలతో 'గట్ హెల్త్ గమ్' లాంటివీ వచ్చాయి. ఇవేకాదు... ఈమధ్య ఎన్నో స్టార్టప్ కంపెనీలు తక్కువ క్యాలరీలతో పూర్తిగా షుగర్ లెస్, ప్లాంట్ బేస్డ్ చూయింగ్ గమ్స్‌ని తీసుకొస్తున్నాయి. మన దగ్గర 'గుడ్ గమ్' పేరుతో సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన చూయింగ్ గమ్ ఎన్నో రుచుల్లో దొరుకుతోంది!

ఎన్ని రుచులో...

మామూలుగా ఎక్కువసేపు తాజాదనాన్ని ఇచ్చే పుదీనా ఫ్లేవర్ గమ్ వెరైటీలే చాలావరకూ కనిపిస్తుంటాయి. కానీ ఇప్పుడు యాపిల్, దానిమ్మ, పుచ్చకాయ, స్ట్రాబెర్రీ, మామిడి... తదితర పండ్లూ, కూరగాయలూ, ఆకుకూరల ఫ్లేవర్లన్నింటితోనూ వస్తున్నాయి. అంతేకాదు, పసుపు, అల్లం, దాల్చిన చెక్క, యూకలిప్టస్, కాఫీ, వెనిల్లా రుచుల్లోనూ ఉన్నాయి. పూర్తిగా ఆ పదార్థాలతోనే ప్రత్యేకంగా వీటిని తయారుచేస్తున్నారు. తీపి కోసం మొక్కలూ, పండ్లలో ఉండే జైలటోల్ అనే పదార్థాన్ని కలుపుతారు. ఇది సహజమైన చక్కెరలా పనిచేయడమే కాదు... బ్యాక్టీరియాని తగ్గించి, దంత సమస్యల్ని దూరం చేస్తుంది, చిగుళ్ల వాపును పోగొడుతుంది. చక్కెరలా తియ్యగా ఉన్నా దీంట్లో క్యాలరీలు మాత్రం చాలా తక్కువగా ఉంటాయి. ఇంకా తక్షణ శక్తిని ఇచ్చే ఎనర్జీ చూయింగ్ గమ్స్ చాలానే వచ్చాయి. మాచా ఆకులతో తయారుచేసిన గమ్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఏకాగ్రతను పెంచడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. సాధారణ గమ్స్ తియ్యగా ఉండి, తాజా శ్వాసను మాత్రమే ఇస్తే- ఈ ప్లాంట్ బేస్డ్ గమ్స్ పండ్లూఫలాల రుచులు చూపిస్తూనే ఆరోగ్యాన్నీ అందిస్తున్నాయి. ఈసారి, కాలక్షేపానికైనా- ఏదో ఒకటి అని కాకుండా సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసే హెల్దీ గమ్‌నే నమలండి మరి! ★



జాలీ జాలీగా... హోలీ ఆడేద్దామా!



లేలేత చిగుళ్లూ, హరివిల్లు వర్ణాల పూలూ వసంత రుతువుకు స్వాగతం పలుకుతుంటే... ఆ ఆనందం- మన కోసం హోలీ పండుగైంది. ఆటపాటలూ, ఆనందోత్సవాలతో రంగులు చల్లుకునే సంబరాల కేళి అయింది. ప్రకృతి రంగుల్లో మమేకం చేసుకుంటూ మోడువారిన జీవితాల్లోనూ కొత్త ఆశలు పుట్టించే ఈ పండుగ విశేషాలు ఇంకెన్నెన్నో!

ఫ్యాషన్ హంగామా!



రంగుల పండుగ కోసం మార్కెట్లో రకరకాల ఫ్యాషన్లూ సిద్ధమైపోయాయి. పిల్లలకూ పెద్దలకూ నప్పేలా ఎన్నో కొత్త వెరైటీలు వచ్చేశాయి. టీషర్టులూ, కుర్తీలూ మొదలు చుడీదార్, చీరల వరకూ- ఒకటా రెండా, హరివిల్లు వర్ణాల్లో హోలీ దుస్తులన్నీ కనిపిస్తున్నాయి. వీటిల్లో కలర్‌ఫుల్ థీమ్స్‌తో ఫ్యామిలీ సెట్స్ కూడా చాలానే ఉన్నాయి. రంగులు విరజిమ్మిన బొమ్మలూ, చేతి అచ్చులూ, రాధాకృష్ణుల హోలీ కేళీ, పండుగ శుభాకాంక్షలు చెప్పే అక్షరాలూ, ఫొటోలూ... తదితర పండుగ ప్రింట్లతో అలరిస్తున్నాయి ఇవన్నీ కూడా. రొటీన్‌కు భిన్నంగా వీటిని వేసుకున్నారంటే రంగుల ఆట మొదలుపెట్టక ముందే ఆ ఆనందాన్నీ ఉత్సాహాన్నీ తెచ్చి పెడతాయీ ఫెస్టివల్ ట్రెండ్స్. అంతేనా... రోజంతా ఆ జోష్‌లోనే గడపాలనుకునేవాళ్లు పండుగ విందులూ, పార్టీలకూ ఎంచక్కా ఈ హోలీ డ్రెస్సులతో ముస్తాబై వెళ్లొచ్చు. ఎలాంటి హడావుడీ లేకుండానే ఫొటోల్లో హోలీ మొత్తం కనిపించేస్తుందంతే!



కలర్‌ఫుల్ రుచులు!

ఉగాది, సంక్రాంతి, దీపావళి... ఇలా ఒక్కో పండుగను ఒక్కో రకమైన పిండివంటలతో జరుపుకోవడం మనకు ఆనవాయితీ. కానీ ఉత్తర భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో హోలీ పండుగ రోజు కూడా ప్రత్యేకమైన వంటకాలు వండుకుంటారు. మిఠాయిలతోపాటు కమ్మటి రుచుల రంగుల వంటలూ చేసుకుంటారు. బీట్‌రూట్, క్యారెట్, గ్రీన్‌పీస్ వంటి కూరల్ని కలుపుతూ రంగురంగుల హోలీ థాలీని తయారుచేసుకుంటారు. ఇంట్లో ఉండే రకరకాల కూరగాయలూ, పప్పు దినుసులతోనే పదార్థాలకు రెయిన్‌బో రంగులు తీసుకొస్తారు. ఇంకా వివిధ దుకాణాల్లో హోలీ స్పెషల్ స్వీట్ ప్యాకెట్లూ, చాక్లెట్లూ, కేకులూ అమ్ముతున్నారు. మీరూ ఈసారి పండుగను ప్రత్యేకంగా జరుపుకోవాలనుకుంటే- ఈ రంగుల వంటల్ని ప్రయత్నించొచ్చు. రంగుల విందుతో ఇంట్లో వాళ్లను ఆశ్చర్యపరచొచ్చు!

కొత్త బొమ్మలు!





హోలీ అనగానే 'నాకు ఈసారి పెద్ద గన్ కావాలి, చాలా రంగులు కొనియ్యాలి' అంటూ పిల్లల సందడి మొదలైపోతుంది. అందుకు తగ్గట్టే రంగుల ఆట కోసం కొత్త కొత్త వస్తువులూ వస్తుంటాయి. అలా ఈసారి కూడా ఎన్నో హోలీ టూల్స్, టాయ్స్ వచ్చేశాయి. 'మ్యాజిక్ కలర్ గ్లాస్' చూడ్డానికి మామూలు పేపర్ గ్లాసులాగే కనిపిస్తుంది. కానీ దాంట్లో నీళ్లు పోయగానే మాయ చేసినట్టుగా క్షణాల్లో అవి రంగు నీళ్లలా మారిపోతాయి. ఇలా ఒకసారో, రెండుసార్లో కాదు... దాదాపు 50 సార్ల వరకూ మామూలు నీళ్లను కలర్ వాటర్‌గా మార్చొచ్చు. రంగు పొడిని కాగితం లోపల ఉంచుతూ ప్రత్యేకంగా తయారుచేయడం వల్లే ఈ మ్యాజిక్ కనిపిస్తుంది. ఇంకా 'ఎలక్ట్రిక్ వాటర్ గన్'తో సరదాగా నిప్పులు కురిపించొచ్చు. నీళ్లు పోసి నొక్కితే తుపాకీ నుంచి ఫైర్ వచ్చినట్టుగా కనిపించడమే దీని ప్రత్యేకత. స్నేహితులతో ప్రాంక్ చేయాలంటే 'హోలీ కలర్ బాంబ్ బాక్సు'ని ఇచ్చి చూడండి. దీన్ని తెరవగానే ఒక్కసారిగా అందులోని రంగు మొత్తం పైకి చిమ్ముతుంది. ఇవేకాదు.. రంగులు వెదజల్లే హోలీ గులాల్ బాల్స్, కలర్ ట్యాంకర్లూ, వాటర్ గన్ బ్యాగ్స్, రెయిన్ పిచ్‌కారీ గన్ లాంటి టాయ్స్ ఎన్నో దొరుకుతున్నాయి!

పండుగ వెనక కథలు!

ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున జరుపుకునే ఈ హోలీ పండుగ వెనక పురాణగాథలెన్నో ఉన్నాయి. విష్ణుభక్తుడన్న కారణంతో ప్రహ్లాదుడిని సోదరి హోలిక సాయంతో చంపాలనుకుంటాడు హిరణ్యకశిపుడు. మంటల నుంచి రక్షణనిచ్చే శాలువా కప్పుకున్న హోలిక ఒడిలో ప్రహ్లాదుడిని కూర్చోబెట్టి దహనం చేయబోగా, ఆ నారాయణుడి మహిమ వల్ల హోలిక కప్పుకున్న శాలువా ఎగిరి ప్రహ్లాదుణ్ణి చుట్టుకుంటుంది. దీంతో హోలిక దహనమై, ప్రహ్లాదుడు క్షేమంగా బయటకొస్తాడు. చెడు పైన మంచి గెలిచిన ఆ సందర్భానికి గుర్తుగా హోలికా దహనం వచ్చింది. అలా హోలీ పండుగకు మంటలు వేయడం మొదలుపెట్టారు. హోలీనే దక్షిణాదిన కాముని పున్నమి అని కూడా పిలుస్తారు. పల్లెటూళ్లలో దీన్ని రెండు రోజుల పాటు చేసుకుంటారు. దక్షయజ్ఞ సమయంలో అగ్నికి ఆహుతి అయిన సతీదేవి, ఆ తర్వాత హిమవంతుని కూతురైన పార్వతిగా జన్మిస్తుంది. తపోదీక్షలో ఉన్న పరమశివుడికి పార్వతి సపర్యలు చేస్తూ ఉంటుంది. లోక కల్యాణం కోసం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని జరిపించమని దేవతలు మన్మథుడిని ఆశ్రయిస్తారు. వారి కోరిక మేరకు సదాశివుడిని కామ భావనలకు గురి చేయడం కోసం మన్మథుడు పూల బాణాలు వేస్తాడు. తన తపోదీక్షకు భంగం కలిగించిన మన్మథుడిని మూడో నేత్రం తెరిచి భస్మం చేస్తాడు శంకరుడు. దేవతల అభ్యర్థన మేరకు, లోక కల్యాణం కోసం తన భర్త ఆ విధంగా చేశాడంటూ రతీదేవి కన్నీటి పర్యంతమవుతుంది. తన భర్తను బతికించమని శివుడిని వేడుకుంటుంది. ఆమె కోరిక మేరకు అతన్ని తిరిగి బతికిస్తాడు కానీ కామదేవుడికి శరీరం ఉండదు. దీంతో రతీదేవి భర్తను చూడగల్గుతుంది కానీ తాకలేదు. క్షణికావేశమైన భౌతిక వాంఛలకి అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతోనే గడ్డితో కాముని బొమ్మ చేసి కాల్చి, రంగులు చల్లుకుంటారు. అందుకే ఈ పండుగని కాముని పున్నమి, కామదహనం అనీ అంటారు. ఇంకా మరో పురాణ కథ ప్రకారం... రాధ తనని నల్లనివాడు అంటుందంటూ ఉడుక్కున్న కృష్ణయ్యకు రాధ మొహం మీద కాస్త నల్లని రంగు రాయమని చెబుతుంది యశోదమ్మ. దాంతో రాధతోపాటు ఆమె చెలికత్తెల మీదా రంగులు చల్లిన రోజే హోలీ పండుగగా మారిందని చెబుతారు. నాటి నుంచీ బృందావనం, మథుర, నందగావ్ ప్రాంతాల్లో హోలీ సంబరాలు చేసుకోవటం ఆచారమైంది.



రంగులతో ఆరోగ్యం!

శిశిరం గడిచి వసంత కాలం ఆరంభమయ్యే సమయం ఇది. వాతావరణం చలి నుంచి ఎండలకి మారే ఈ కాలంలో అనారోగ్యాలు వచ్చే అవకాశముంది. వాటి నుంచి ఉపశమనం పొందేందుకు వచ్చిందే వసంతకేళి. ఉత్తరాదిన హోలీ రూపంలో మొదలైన ఈ వేడుక- ఇప్పుడు దేశమంతటా, వివిధ దేశాల్లోనూ కనిపిస్తోంది. శ్రీరామనవమికి మన దగ్గర వసంతం చల్లుకోవడం కూడా ఇందులో భాగమే. వెనకటి రోజుల్లో- వేప, బిల్వ, అగ్నిపూలూ, మందార లాంటి ఔషధగుణాలున్న చెట్ల ఆకులూ, పూల పొడులూ, పసుపు, కుంకుమలూ కలిపి చల్లుకునేవాళ్లు. ఇవి శరీరాన్ని చల్లబరిచి, ఆరోగ్యానిస్తాయని నమ్ముతారు. కాలక్రమేణా పూల స్థానంలో రకరకాల రంగులు వచ్చాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... హోలీ పండుగలో చల్లుకునే ప్రతి రంగూ మన భావోద్వేగాల మీదా ప్రభావం చూపుతుందని చెబుతున్నాయి పరిశోధనలు. నవ్వుతూ, కేరింతలు కొడుతూ స్నేహితులతో ఆడుకోవడం వల్ల హ్యాపీ హార్మోన్స్ విడుదలవుతాయి. దీంతో ఒత్తిడి తగ్గి, మానసిక ప్రశాంతత వస్తుంది.



జాగ్రత్త సుమా!

హోలీ పండుగ ఆనందంగా సాగాలంటే తప్పకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా కృత్రిమ రంగుల జోలికి అస్సలు వెళ్లకూడదు. వీటివల్ల కళ్లూ, జుట్టూ, చర్మం దెబ్బ తినొచ్చు. కాబట్టి పూలతో తయారుచేసిన సహజసిద్ధమైన రంగుల్నే ఎంచుకోవాలి. ఓపిక ఉంటే బీట్‌రూట్, వేప, పసుపు, గులాబీ పూల లాంటివాటితో ఇంట్లోనే తయారుచేసుకోండి. ఆడే ముందు ఒంటికి మాయిశ్చరైజర్ లేదా కొబ్బరి లేదా ఆలివ్ నూనె రాసుకోవాలి. ముఖ్యంగా గోళ్లూ, చెవుల దగ్గరా బాగా రాయాలి. జుట్టుకు కూడా కొబ్బరి నూనె రాసుకోవాలి. ఇది రక్షణ పొరలా పనిచేయడమే కాదు, రంగులు త్వరగా పోవడానికీ ఉపయోగపడుతుంది. ఎండలో ఆడటం వల్ల ముఖం నల్లబడకుండా సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా ఫుల్‌హ్యాండ్ డ్రెస్సులు ధరించాలి. కుదిరితే కళ్లజోడు పెట్టుకోవాలి. అనుకోకుండా కళ్లలో రంగులు పడినా... టిష్యూలాంటి వాటితో తుడవకుండా దోసిట్లో నీటిని తీసుకుని అందులో ముఖం పెట్టి కళ్లను నెమ్మదిగా తెరవాలి. రంగులు ఆడుతూ అదే చేతితో ఎలాంటి ఆహారం తినకూడదు. మేడలపైనా, అపార్టుమెంట్ల మీదా హోలీ ఆడకూడదు, సందడిలో ప్రమాదాలు జరగొచ్చు. హోలీ ఆడాక గోరువెచ్చని నీటితో రంగుల్ని పూర్తిగా శుభ్రం చేసుకోవాలి. స్నానం తర్వాత కూడా ఒంటికి మాయిశ్చరైజర్ లేదా నూనె రాసుకోవాలి.







విల్లు ఎక్కుపెడితే ఆ అర్జునుడి గురి ఎలా తప్పదో... నేరస్థులని పట్టుకునే విషయంలో ఈ అర్జున్ కూడా గురి తప్పడు. అయితే ఇతను విల్లు ఎక్కుపెట్టడు... తన కళ్లతోనే ఎంతటి నేరస్థుడినైనా పట్టేసుకుంటాడు. దేశంలోనే మొదటిసారి ఏఐ రోబో రైల్వేపోలీస్‌గా బాధ్యతలు తీసుకున్న ఏఎస్సీ అర్జున్ గురించిన ప్రస్తావన ఇది...



రోబో పోలీస్... అర్జున్ వచ్చేశాడు!

నేను ఏఎస్సీ అర్జున్... పాత నేరస్థులు కిషన్, నవీన్(పేర్లు మార్చాం) రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం 2 దగ్గర ఉన్నారు బి- అలెర్ట్... ఇది వైజాగ్ రైల్వే పోలీస్ కంట్రోల్ రూమ్‌కి అర్జున్ అందించిన సమాచారం. వెంటనే రైల్వే పోలీసులు అప్రమత్తమై వాళ్లని పట్టుకున్నారు. ఇద్దరికీ టిక్కెట్లు లేవు... ఆరా తీస్తే, ఒడిశాలోని రాయగడ పోలీస్‌స్టేషన్లో వాళ్లిద్దరిపైనా 20కి పైగా కేసులున్నాయి. ఒడిశా పోలీసులు గాలిస్తున్న మోస్ట్ వాంటెడ్ నేరస్థుల్లో వీళ్లూ ఉన్నారు. ఇలాంటి నేరస్థులని పట్టుకున్న గొప్పతనం రైల్వే పోలీసులదే అయితే మనం పెద్దగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు, కానీ వాళ్లను పట్టించింది వైజాగ్ రైల్వేస్టేషన్‌లో పనిచేస్తున్న ఏఐ రోబో ఏఎస్సీ అర్జున్ కావడమే విశేషం. దేశంలోనే మొదటి ఏఐ రైల్వే రోబో పోలీస్‌గా పనిచేస్తున్న అర్జున్ నేరస్థులని గుర్తించడంలో దిట్ట. ఇవికాక అర్జున్‌కి ఇంకా చాలా విశేషాలున్నాయి.

నేరస్థులని స్కాన్ చేస్తుంది...

పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలో ఉంటుంది రైల్వే ప్రయాణం. అందుకే ఏడాది పొడవునా మన రైల్వేస్టేషన్లూ, రైళ్లూ కిక్కిరిసి ఉంటాయి. వెయ్యి కళ్లతో సాధారణ పోలీసులూ, రైల్వే పోలీసులూ పహారా కాస్తున్నా నేరస్థులు తప్పించుకునేందుకు ఆస్కారం ఎక్కువ. ఈ సమస్యలను పరిష్కరించడంతోపాటు రైల్వేల ఆధునికీకరణ, డిజిటలైజేషన్‌లో భాగంగా మొదటిసారి తూర్పుకోస్తా రైల్వే వాల్తేరు డివిజన్‌లో అధికారులు ఈ మధ్యనే ఈ రోబోపోలీస్‌ని ప్రవేశపెట్టారు, పేరు ఏఎస్సీ అర్జున్. నిత్యం కిటకిటలాడే వైజాగ్ రైల్వేస్టేషన్‌లోకి అర్జున్‌కి తెలియకుండా చీమ కూడా రాలేదు. వచ్చేవాళ్లనీ, పోయేవాళ్లనీ అర్జున్ తన కెమెరా కళ్లతో ఆసాంతం స్కాన్ చేస్తాడు. ఏఐ, ఐఓటీ, ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీలను కలుపుకుని పనిచేసే అర్జున్ ఎంత రద్దీలో అయినా పాత నేరస్థులు కనిపిస్తే ఇట్టే గుర్తుపట్టేస్తాడు. ఆ సమాచారాన్ని వెంటనే కంట్రోల్ రూమ్‌కి పంపించి పోలీసులను అప్రమత్తం చేస్తాడు. అదొక్కటే కాదు, స్టేషన్ మొత్తాన్ని 24 గంటలూ కాపలా కాస్తూ, తనకు అప్పగించిన జియోఫెన్సింగ్ ఏరియాలో పగలూరాత్రీ తిరుగుతూ ఉంటాడు. ఆ పరిధిలో ఎవరైనా ప్రయాణీకులు గొడవపడుతున్నా, ఎక్కడైనా శుభ్రత లోపించినా వెంటనే అధికారులకి ఆ సమాచారం చేరవేస్తాడు. టీ తాగడానికో, వాష్‌రూమ్‌కి వెళ్లడానికో లగేజీని వదిలి వెళ్లాలంటే ప్రయాణికులు భయపడతారు కదా, అర్జున్ ఉండగా అలా భయపడాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే అర్జున్ ఆ లగేజీకి కాపలా ఉంటాడు. కెమెరా కళ్లున్న అర్జున్ ముందు ధైర్యం చేసి ఎవరూ ఆ లగేజీని దొంగిలించలేరు కదా! ఆర్పీఎఫ్ పోలీసులు అర్జున్ సేవలని షిఫ్టుల వారీగా ఉపయోగించుకుంటున్నారు. విధులకు హాజరయ్యే ముందు సంబంధిత అధికారులకు సాధారణ పోలీసుల్లాగానే సెల్యూట్ చేసి డ్యూటీలకు హాజరవుతాడీ అర్జున్. తన కళ్లకు కనిపించేంత దూరంలో అందరి ఫొటోలనూ నిక్షిప్తం చేసుకుంటూ... వాళ్లలో పాతనేరస్థులు ఉంటే గుర్తుపట్టేస్తాడు. గంజాయి వంటి అక్రమ రవాణా జరుగుతున్నా వెంటనే కంట్రోల్‌రూమ్‌ని అప్రమత్తం చేస్తాడు. ఏఐ టెక్నాలజీతో స్టేషన్‌లోకి వచ్చే ప్రయాణికుల సంఖ్యను అంచనా వేసి... ఒక వేళ రద్దీ ఎక్కువ ఉంటే ఎక్కడ ఎక్కువ ఉన్నారో చూసి అధికారులకి ఆ సమాచారమిచ్చి క్రౌడ్ మేనేజ్‌మెంట్ చేస్తాడు. సీసీ కెమెరాలు లేని బ్లైండ్ స్పాట్స్‌ని గుర్తించి ఆయా ప్రాంతాల్లో దొంగతనాలు జరిగినా, అగ్ని ప్రమాదాలూ పొగ రావడం వంటివి జరిగినా కంట్రోల్‌రూమ్‌కి సమాచారం చేరవేస్తాడు.

ఏడాది శ్రమతో...

చైనా, జపాన్‌వంటి దేశాల్లో ఏఐ పోలీస్ సేవలు పెరుగుతున్న నేపథ్యంలో... మన దేశంలోనూ ఇలా ఏఐ రోబోకాప్‌ని ప్రవేశ పెట్టాలనుకున్నారు మన రైల్వే పోలీసులు. ముఖ్యంగా కొవిడ్ అప్పుడు ఎదురైన అనుభవాలతో అత్యవసర సమయాల్లో మనుషుల ప్రమేయం లేని హ్యూమనాయిడ్ రోబో సేవలని ప్రవేశపెట్టాలని అనుకున్నారట. అందుకే కొవిడ్ సమయంలో ప్రయాణికులకి సేవలందిస్తూ మరణించిన రైల్వే అధికారి ఏఎస్సీ అర్జున్ పేరునే ఈ రోబోకీ పెట్టారు. ఏఐ పరిజ్ఞానంతో 24 గంటలూ సేవలు అందించే అర్జున్ తయారయ్యింది కూడా వైజాగ్‌లోనే. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమాండెంట్ ఏకే దూబే ఆలోచనల్లోంచి పుట్టిన అర్జున్‌ని రోబోకాప్లర్ అనే సంస్థ ఏడాదిపాటు శ్రమించి పాతనేరస్థులకి సంబంధించిన డేటా మొత్తాన్నీ ఈ ఏఐ రోబోకి అందించి దీన్ని తయారుచేసింది. దాని ఆధారంగానే ఎంత రద్దీలో ఉన్నా అర్జున్ నేరస్థులని తేలిగ్గా గుర్తుపట్టేస్తాడు. ఈ రోబో ఖరీదు రూ.20 లక్షలు. దీనిని మరింత ఆధునీకరించి భవిష్యత్తులో ఇతర రైల్వేస్టేషన్లలోనూ ఈ తరహా రోబోకాప్‌లని ప్రవేశపెట్టనున్నారట. బాగుంది కదూ... రోబో పోలీస్ పనితీరు!

– రావివలస సురేష్, ఈనాడు, విశాఖపట్నం





వాజేడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వైష్ణవికి ఇదివరకు చెస్ బోర్డ్ అంటేనే తెలియదు. కానీ ఇప్పుడు రోజూ గంటసేపు ఆడుతూ స్నేహితులకూ నేర్పిస్తోంది, చదరంగ పోటీలకూ సిద్ధమవుతోంది. దండేపల్లిలోని అరవై ఏళ్ల రాజన్న- కాస్త సమయం దొరికినా ఊళ్లోని చెస్ అడ్డాకి వెళ్లిపోయి హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు, వేరేవాళ్లకూ శిక్షణ ఇస్తున్నాడు. వీళ్లేకాదు... హనుమకొండ, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్... చుట్టుపక్కల మండలాల్లోని పాఠశాల విద్యార్థులూ ఈ ఆటలో పోటీపడుతున్నారు. ఒక ఊరి నుంచి మొదలై పక్క జిల్లాలకూ విస్తరిస్తున్న ఈ చెస్ నెట్‌వర్క్ కథాకమామిషు ఏంటో చూద్దామా!



ఖాళీ దొరికితే చాలు... చెస్ ఆడేస్తారు!



'ఊరంతా కలిసి ఒకే దగ్గర భోజనం చేస్తారు,' 'చదువులో అదో ఆదర్శ గ్రామం' అంటూ ప్రగతి సాధించిన పల్లెల గురించి పత్రికల్లో చదువుతూనే ఉంటాం. ఒక్కో రకమైన సమస్యతో ఇబ్బంది పడుతూ దాన్ని అధిగమించిన తీరును చూసి ఆశ్చర్యపోయినా ఆ తర్వాత ఆ ఆలోచనను అక్కడే వదిలేస్తాం. కానీ 'అలా మనమూ ప్రయత్నించకూడదా' అన్న చిన్న ప్రశ్నతో మొదలైందీ చెస్ నెట్‌వర్క్. చెడు వ్యసనాల్ని దూరం చేసుకోవడానికి ఆటను అలవాటుగా చేసుకున్న కేరళలోని మరోట్టిచల్ ఊరి స్ఫూర్తితోనే హనుమకొండ జిల్లాలోని దండేపల్లి- చెస్ గ్రామంగా మారింది.

దాదాపు 3600 మంది జనాభాతో ఉండే ఈ గ్రామంలో చదువుతోనూ, వయసుతోనూ సంబంధం లేకుండా చదరంగం ఆడుతున్నారు. శివాలయంలో, పాఠశాలలో, చెట్ల కింద, షాపుల ముందు, రచ్చబండల దగ్గర చెస్ అడ్డాలు ఏర్పాటు చేసుకున్నారు. ఏ కాస్త టైమ్ దొరికినా చెస్ ఆడుతున్నారు. 64 గళ్ల యుద్ధభూమిలో ఎత్తుకు పైఎత్తు వేస్తూ పోటీలు పెట్టుకుంటున్నారు. వేడుకలూ, పొదుపు సంఘాలూ, రైతు గ్రూపుల్లోనూ చదరంగం బోర్డులు పంచుతూ వందశాతం చెస్ ఆడే గ్రామంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం మొదలైన ఈ నెట్‌వర్క్ ఇప్పుడు చుట్టుపక్కల జిల్లాలకూ విస్తరించింది.

ఆలోచన ఎలా...

విదేశాల్లో స్థిరపడిన ఈ ఊరికి చెందిన సుధీర్ కోదాటి- పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలన్న ఉద్దేశంతో ఇంచుమించు ఓ ఇరవై ఏళ్ల క్రితం తన స్నేహితులతో కలిసి 'రూరల్ లైబ్రరీ ఫౌండేషన్'ను స్థాపించాడు. దండేపల్లితో పాటు పక్కనున్న పల్లెల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ గ్రంథాలయాల్ని ఏర్పాటుచేశాడు. కొవిడ్ వరకూ బాగానే నడిచినా ఆ తర్వాత విద్యార్థుల రాక పూర్తిగా తగ్గిపోతూ వచ్చింది. కొవిడ్ సమయంలో రెండేళ్లపాటు గ్రామంలోనే ఉన్న సుధీర్- చిన్నవయసులోనే పిల్లలు అతిగా ఫోన్లు చూడటం, పెద్దలు కూడా మద్యపానం, జూదం లాంటివాటికి అలవాటు పడటాన్ని దగ్గర్నుంచి చూశాడు. అదే సమయంలో చిన్నవయసులోనే గ్రాండ్ మాస్టర్ హోదా తెచ్చుకున్న చెస్ దిగ్గజం- పొరుగూరికి చెందిన అర్జున్ ఇరిగేశి ప్రయాణం అతడిలో స్ఫూర్తి నింపింది.


సుధీర్

యువతలో ఏకాగ్రత పెంచాలన్నా, పెద్దవాళ్లను వ్యసనాలకు దూరం చేయాలన్నా చదరంగమే సరైన పరిష్కారం అనుకున్నాడు. అందుకు కేరళలోని చెస్ విలేజ్‌ని ఆదర్శంగా తీసుకుని ఆట మొదలుపెట్టాడు. తనలాగే ఊళ్లో చదరంగం అంటే ఆసక్తి ఉన్న స్నేహితులతో కలిసి సరదాగా పోటీ పెట్టాడు. దీనికి పిల్లలూ ఎంతో ఆసక్తి చూపించారు. దీంతో వాలంటీర్ల సాయంతో ఇంకొంతమందికి చెస్‌లో శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాడు. ఉచితంగా చెస్‌బోర్డుల్నీ, ఆట నియమాల్ని తెలిపే పుస్తకాల్నీ ఇస్తూ అందరికీ ఆటని దగ్గర చేశాడు. తక్కువ సమయంలోనే ఆశించిన ఫలితాలు రావడంతో పక్కనున్న పల్లెలతో కలిసి వాట్సప్ గ్రూపులు పెట్టాడు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు చెస్‌ని పరిచయం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు సుధీర్. ఈ మంచి పనిని ప్రభుత్వమూ ప్రోత్సహిస్తూ బడిలో చదరంగం పోటీలకు అనుమతి ఇచ్చింది. అలా టీచర్లూ చదరంగం నేర్చుకుంటూ, పిల్లలకు శిక్షణ ఇవ్వడం మొదలైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 'పాలమూరు ఎన్నారై ఫోరం' ఈ చెస్ నెట్‌వర్క్ సాయంతో అన్ని పాఠశాలలకూ చదరంగం ఆటను తీసుకెళ్లింది. ఇప్పటివరకూ హనుమకొండ, వరంగల్, కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డి, నిజామాబాద్... తదితర జిల్లాల్లో దాదాపు 2500 పాఠశాలలకు చెస్ ఆట చేరువైంది. ఈ నెట్‌వర్క్‌లో భాగంగా ఉచితంగా చెస్‌బోర్డుల్నీ, పుస్తకాల్నీ అందిస్తూ, ఆట నేర్పిస్తూ, పోటీలు నిర్వహిస్తూ రకరకాల కార్యక్రమాలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ దీనంతటికీ దాదాపు రూ.50 లక్షల వరకూ ఖర్చయ్యిందట. చెడు అలవాట్లను తరిమికొట్టే ఈ ఆటను ప్రతి ఊరికీ తీసుకెళ్లాలంటూ దాతలు ముందుకొస్తూ, విరాళాలిచ్చి తమ మండలాల్లోనూ ఈ చెస్ నెట్‌వర్క్‌ను పెంచుతున్నారు! ★



కథ

చిన్నా మాటా...
ఒక చిన్నా మాటా...

– శ్రీపతి లలిత

"గుడ్ మార్నింగ్ అత్తయ్యా" కొత్త కోడలు చెప్తుంటే, ఆశ్చర్యంగా చూసింది సునీత.

"అప్పుడే లేచి, స్నానం చేసి, రెడీ అయ్యావా శృతీ" అంది విరిసిన పువ్వులాగా ఉన్న కోడలిని చూస్తూ.

"అత్తయ్యా, నేను పిల్లల డాక్టర్‌ని, ఎనిమిదికల్లా పేషెంట్లను చూడటం మొదలుపెట్టాలి మరి" అంది శృతి.

"అయ్యో, నువ్వు ఇవాళే డ్యూటీలో చేరిపోతావనుకోలేదమ్మా. రెండు దోసెలు వేస్తాను తినేసి వెళ్ళు" అంది సునీత నొచ్చుకుంటూ.

"అత్తయ్యా, మీరు టెన్షన్ పడకండి, నేను కాఫీ తాగి వెళ్తాను. వారం నుంచీ పిల్లల్ని చూడలేదుగా... చూసి, లంచ్‌కి వస్తాను. కళ్యాణ్ కూడా ఆసుపత్రికి వెళ్ళి వస్తాడు" నవ్వుతూ అంది శృతి.

కోడలి వైపు మురిపెంగా చూసింది సునీత. తెల్లగా సన్నగా సన్నజాజి మొగ్గలా ఉంటుంది శృతి. కొత్తగా పెళ్లైందేమో, మెడలో మెరుస్తున్న పసుపుతాడు, మంగళసూత్రం, నల్లపూసలు, పాపిట్లో సింధూరం, అన్నిటికంటే చక్కటి నవ్వు... ఆ అమ్మాయికి అలంకారం.

బయటికి వెళ్తుంటే, సునీత అత్తగారు కామాక్షి, "ఏంటే పిల్లా... పదహారు రోజులు కాకుండానే వెళ్తున్నావ్?" అంది కొత్త మనవరాలిని చూస్తూ.

"తప్పదు అమ్మమ్మగారూ" అంటూ వెళ్ళిపోయింది.

లంచ్ టైమ్‌కి అందరూ కూర్చున్నారు.

పేరుకి అందరూ అన్నమాటేగానీ, అత్తగారికీ భర్తకీ వడ్డించడమే సరిపోయింది సునీతకి.

"సునీతా, వంకాయ కూరలో ఉప్పు ఎక్కువైంది, అల్లం ఇంకొంచెం పడాలి, టొమాటో పప్పులో తిరగమాత వేగలేదు" అత్తగారు అంటుంటే,

"అవును, అమ్మ చెప్పింది కరెక్ట్. ఎన్నేళ్ళయినా వంట రాదమ్మా, ఎంత చెప్పినా అంతే, మొద్దుమొహం" సునీత భర్త ప్రకాష్ అందుకున్నాడు.

కళ్యాణ్ వంచిన తల ఎత్తకుండా తింటున్నాడు.

ఇన్ని వంకలు పెడుతూ కూడా, టెన్నిస్ బాల్ అంత ముద్దలు- గుటుకు గుటుకుమని కామాక్షి తింటుంటే, వేళ్ళు నాక్కుంటూ తింటున్నాడు ప్రకాష్.

అదంతా ఏమీ పట్టనట్టు "ఇంకొంచెం కూర వెయ్యనా శృతీ, నా వంటలు నీకు కొంచెం అలవాటు అవ్వాలి, మీ అమ్మ వంటలా ఉండదు" అంది సునీత.

"అవును అత్తయ్యా, మా అమ్మ వంటలా లేదు. మా అమ్మకి వంట రాదు. చాలామటుకు నాన్నే చేస్తారు" నవ్వుతూ అంది.

"హేమిటీ... ఆడంగిలాగా మీ నాన్న చేస్తాడా వంట? మీ అమ్మ ఏం చేస్తుందీ?" అంది కామాక్షి అన్నంతో నిండిన బుగ్గలు నొక్కుకుంటూ.

"మా అమ్మ టీచర్ కదా అమ్మమ్మగారూ. స్కూల్ బస్ ఏడు గంటలకి వస్తుంది, తనకి భోజనం స్కూల్లోనే. అందుకని నాకూ నాన్నకీ నాన్నే వంట చేసేవారు. నాకూ కొంచెం వంట వచ్చనుకోండీ" అంది.

ఆ తర్వాత శృతి గమనిస్తే- సునీత చేసిన ప్రతీ వంటనీ కామాక్షి, ప్రకాష్ విమర్శిస్తూనే ఉండేవారు. 'కాఫీలో పాలు తక్కువయ్యాయి, ఇడ్లీ గట్టిగా ఉంది, పచ్చడి మెదగలేదు' ...ఇలా అన్నింటికీ వంకలే.

కళ్యాణ్ ఏమాత్రం పట్టించుకోకుండా, ఒక రుషిలాగా ఉంటే, మొహంలో విసుగూ చిరాకూ లేకుండా ఎప్పుడూ నవ్వుతూ ప్రశాంతంగా ఉండేది సునీత. అత్తగారిని అలా చూస్తే చిత్రంగా ఉండేది శృతికి.

తట్టుకోలేక ఒకసారి సునీతని అడిగేసింది, "మీరు చేసిన ప్రతీ పనినీ ఇద్దరూ తెగ విమర్శిస్తారు, మళ్ళీ ఒక్క పని కూడా చెయ్యరు. వాళ్ళమీద మీకు కోపం రాదా అత్తయ్యా?"



"మా అత్తగారు పాతకాలం మనిషి శృతీ. కొడుకు ఎక్కడ తన చెయ్యి దాటిపోతాడోనని భయం. మా పెళ్ళైన కొత్తల్లో ఒకరోజు, ఆవిడ, 'పెళ్ళాన్ని నెత్తికి ఎక్కించుకుంటే దింపలేవురా. పొరపాటున ఏదైనా బావుందనీ, వంట బాగా చేశావనీ పొగిడితే, మర్నాటి నుంచీ నీకు గడ్డి పెడుతుంది. ఏవో వంకలు పెడుతూ ఉంటే ఇంకా బాగా చేస్తుంది' అని చెప్తుంటే విన్నాను. తల్లి మాట జవదాటని కొడుకు మీ మామగారు.

అప్పటికీ 'బావుందంటే, ఇంకా బాగా చేసి పెట్టాలనిపిస్తుంది. వంకలు పెడితే, అది కూడా చెయ్యాలనిపించదు' అని చెప్పాను. వాళ్ళ పద్ధతిలో మార్పులేదు. మొదట్లో కోపం వచ్చి, ఏమీ చెయ్యాలనిపించేది కాదు. తర్వాత, 'అసలు వాళ్ళ మెప్పు కోసం ఎందుకు చెయ్యాలి? నేనూ నా కొడుకూ రుచిగా తినాలి, అదే వాళ్ళకి పెడతాను, మెచ్చుకోకపోయినా లెక్కచెయ్యను' అనుకున్నాను.

మా అత్తగారు చెడ్డది కాదు. ఉన్న ఒక్క కొడుకూ, తన గుప్పెట నుంచి జారిపోతాడని భయం" అంది సునీత నవ్వుతూ.

శృతికి అది నచ్చలేదు. తమ ఇంట్లో ఎవరు ఏ చిన్న పని చేసినా మెచ్చుకోవడం, ప్రోత్సహించడం అలవాటు. ఆఖరికి, అది ఇంట్లో పనిచేసే అమ్మాయైనా సరే. తను ఒక్కతే కూతురు. తల్లి టీచర్, తండ్రి లెక్చరర్. ముగ్గురూ సరదాగా ఉండేవారు. నానమ్మ కూడా అమ్మనే సపోర్ట్ చేసేది. 'పొద్దున్నే స్కూల్‌కి వెళ్ళి ఆ పిల్లలతో వాగి వస్తుంది పాపం. వంటదేముంది, ఎవరైనా చెయ్యొచ్చు' అనేది.

'అవతల మనిషి ఎంత వయసు వాళ్ళైనా, ఎలాంటి హోదాలో ఉన్నా, 'నువ్వు చేసిన పని బావుంది- అని ఒక చిన్న మాట అంటే చాలు, అది ఎంతో ఉత్సాహాన్నిస్తుంది' అంటూ తల్లి చెప్పిన మాట పూర్తిగా పాటిస్తుంది శృతి. అందుకే ఆసుపత్రిలో కూడా, ఆయాల దగ్గర్నుంచీ డాక్టర్ల దాకా శృతిని అందరూ గౌరవిస్తారు.

కళ్యాణ్‌తో ఈ విషయం మాట్లాడితే, "ఏమో శృతీ, మా ఇంట్లో ఎప్పుడూ ఇంతే. మా నాన్నా బామ్మా ఎవర్నీ మెచ్చుకోరు. నన్నూ అంతే. మెరిట్‌లో మెడిసిన్ చదివి, కార్డియాలజీలో ఎమ్మెస్ చేస్తే, ఇంకా సరిగ్గా చదవలేదనీ సంపాదన సరిపోదనీ నొక్కులు నొక్కుతారు. పాపం అమ్మే... నన్ను ముందు నుంచీ ప్రోత్సహించింది" అన్నాడు కళ్యాణ్.

"అబ్బే ఇలా ఊరుకుంటే కాదు, చిన్న క్లాస్ తీసుకోవాలి వీళ్ళకి" అంది శృతి.

"వద్దులే శృతీ, మా నానమ్మ నోరు పెద్దది, మా నాన్న కూడా నిన్నేమన్నా అంటే బావుండదు" నసిగాడు కళ్యాణ్.

అనుకోకుండా మరునాడే దానికి నాంది పడింది.

సునీత ఉదయమే లేచి, తలుపు తీసి పాల పాకెట్లు తీస్తుండగా, కాలు జారి పడిపోయింది.

'అమ్మా...' అన్న కేకకి, అప్పుడే నిద్ర లేచిన శ్రుతి పరిగెత్తుకుని వచ్చింది.

కాలు మెలిక పడటంతో, అక్కడ వాపు వచ్చింది. నెమ్మదిగా సునీతని పట్టుకుని ఇంట్లోకి తీసుకుని వచ్చిన శ్రుతిని చూసి కామాక్షమ్మ, "అయ్యో, ఏమైందే... చూసుకుని నడవద్దూ, గుడ్డిదానిలాగా కళ్ళు మూసుకుని నడిచావా? ఎక్కడి నిద్రా చాలదు నీకు" అంది విసురుగా. కోడలికి దెబ్బ తగిలిందన్న బాధ లేకపోగా, సునీత ఏదో కావాలని పడినట్లుగా ఉంది కామాక్షమ్మకి.

"ఆసుపత్రికి తీసుకెళ్దాం కళ్యాణ్, వాపు వచ్చింది, ఫ్రాక్చర్ ఏదైనా ఉండచ్చేమో" అన్న శ్రుతి మాటలకి, "అవును, నాకూ అలానే అనిపిస్తోంది" అన్నాడు.

"అమ్మో, ఇప్పుడు దీనికి కాలు విరిగితే, నా తిండీతిప్పల సంగతేమిటి... అసలే షుగరూ బీపీ ఉన్నాయి. ఒరేయ్ ప్రకాశం, నన్ను నీ చెల్లెలి ఇంట్లో దింపరా. దీనికి తగ్గాక వస్తాను" లోపలికి వెళ్ళి చిన్న సంచిలో నాలుగు జతల బట్టలు పెట్టుకొచ్చింది ఆవిడ. భార్యకి 'ఎలా ఉంది' అని కూడా పట్టించుకోకుండా, 'సరే' అని తలాడించి, కారు తాళాలు తెస్తున్న మామగారిని చిత్రంగా చూసింది శ్రుతి.

'ఇది నాకు అలవాటే' అన్నట్లు నవ్వాడు కళ్యాణ్.

"నాన్నా, మేము వచ్చేసరికి లేట్ అవుతుంది, మీరు కూడా అత్తయ్యా వాళ్ళింట్లో భోంచేసి రండి. మేము ఎక్కడో అక్కడ తినేస్తాం" వెళ్తూ అన్న కళ్యాణ్ మాటలకి ప్రకాష్ ఆశ్చర్యపోయాడు.

"నీ కోడలు మహా గడుసుదిరోయ్, జాగ్రత్తగా ఉండు. లేదంటే నిన్నూ నీ కొడుకునీ, ఉతికి దణ్ణెం మీద ఆరేస్తుంది" సందు దొరికిందని కామాక్షి కొడుక్కి నీతులు చెప్పింది. తల్లిమాటలకి గంగిరెద్దులా తలాడించాడు పుత్రరత్నం.

అదృష్టవశాత్తూ సునీతకి ఫ్రాక్చర్ అవలేదనీ బాగా బెణికిందనీ చిన్న బ్యాండేజ్ వేసి, కనీసం పది రోజులు కాలి మీద బరువు వెయ్యొద్దన్నారు. ఎముకలు బాగా బలహీనంగా ఉన్నాయనీ అక్కడ బలం పెడితే విరిగే అవకాశం ఉందనీ చెప్పారు డాక్టర్. కాల్షియం తక్కువగా ఉంది కనుక, మందులతోపాటు, పాలూ పెరుగూ బాగా తీసుకోవాలనీ కాలు వాపు తగ్గాక, రోజూ కనీసం అరగంట వాకింగ్ చెయ్యమనీ సూచించారు.

ఇంటికి వచ్చాక, సునీతని నెమ్మదిగా బెడ్‌రూమ్‌లో పడుకోబెట్టి, కిచిడీ చేసింది శ్రుతి. వేడివేడిగా పెడితే తిని, "కూతురు లేదనే లోటు ఈ రోజు తీరిపోయిందమ్మా" సంతోషంగా అంది సునీత.

సాయంత్రానికి వచ్చాడు ప్రకాష్. వచ్చాక కనీసం 'ఎలా ఉంది, ఏం చెప్పారు?' అని కూడా అడగలేదు.

కాసేపు చూసి శ్రుతి చెప్పింది... "అత్తయ్యకి రెండు వారాలు పూర్తి రెస్ట్ కావాలి, మీరు సాయం చేస్తాను అంటే సరే, లేదంటే మనిషిని మాట్లాడతాను."

తలూపాడు ప్రకాష్. అది దేనికో అర్థం కాలేదు.

పడుకునేలోగా, రెండు మూడుసార్లు శ్రుతి అత్తగారి దగ్గరకి వెళ్ళి, వాకర్ సాయంతో బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళింది. చీర మార్చి, నైటీ వేసింది. అన్నింటినీ బెల్లం కొట్టిన రాయిలా చూస్తున్నాడు కానీ, ఏమీ సాయం చెయ్యలేదు ప్రకాష్. పైగా శ్రుతి రూమ్‌లోకి వచ్చినప్పుడల్లా, ముఖం చిట్లించి చూస్తున్నాడు.



"నేను మనిషిని మాట్లాడాను. రేపు వస్తుంది, రెండు వారాలపాటు ఇక్కడే ఉంటుంది. అత్తయ్యగారూ ఆ అమ్మాయీ అమ్మమ్మగారి రూమ్‌లో ఉంటారు" అంటే తలూపాడు ప్రకాష్.

సాయంత్రం అన్నం వండి, అరటికాయ వేయించి, పప్పు చేసింది శ్రుతి.

సునీతకి ముందే పెట్టి, అందరికీ వడ్డించి, తను కూడా తినడం మొదలుపెట్టింది.

"కూర ఇంకా వేగాలి, నూనె తక్కువగా వేశావు, పప్పులో ఇంగువ ఘాటు లేదు" అలవాటుగా అన్నాడు ప్రకాష్.

సునీత గురించి ఏమీ అడగడంకానీ పట్టించుకోవడంకానీ చెయ్యడంలేదని, అసలే తిక్కగా ఉన్న శ్రుతికి ఇంకా ఒళ్ళు మండింది.

"కళ్యాణ్, నాకు వంట ఇలానే వచ్చు. నచ్చినవాళ్ళు తినొచ్చు, లేనివాళ్ళు వండుకోవచ్చు లేదా బయట తినొచ్చు" అంది కోపంగా.

కళ్యాణ్ ఏమీ మాట్లాడలేదు. ప్రకాష్‌కి అవమానంగా అనిపించి, భోజనం వదిలేసి వెళ్ళాడు.

రాత్రి వెయ్యాల్సిన మందులు వేసి, ఆ రోజుకి అత్తగారి దగ్గరే పడుకుంది శ్రుతి.

శ్రుతి వెళ్ళాక ప్రకాష్ కొడుకుతో, "మీ ఆవిడ అలా మాట్లాడితే ఉలుకూ పలుకూ లేకుండా చూస్తావేంటీ?" అన్నాడు కోపంగా.

"అంత బాగా వంట చేసే అమ్మని, వంట సరిగ్గా చెయ్యలేదని నువ్వు తిట్టినప్పుడు ఏమన్నా అన్నానా, ఇప్పుడు అనడానికి?" అంటూ రూమ్‌లోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు కళ్యాణ్.

షాక్ తిన్నాడు ప్రకాష్.

మర్నాడు పొద్దున్నే, హెల్పర్ వచ్చింది. ఆమెకి సునీతని ఎలా చూసుకోవాలో, మందులు ఎలా వెయ్యాలో, అన్నీ చెప్పి, తమ ఫోన్ నంబర్లు కూడా ఇచ్చి వెళ్ళింది శ్రుతి.

హెల్పర్ సాయంతో, వంట మొత్తం పొద్దున్నే చేసేది శ్రుతి. పొద్దుటివే రాత్రికి కూడా తినడానికి ప్రకాష్‌కి కష్టంగా ఉండేది. సునీతలాగా టిఫిన్లు రకరకాలు చేసేది కాదు. ఇడ్లీ లేదా ఉప్మా, అంతే!

ఒకరోజు ప్రకాష్, "ఈ వంటలు తినలేక చస్తున్నా" అని విసుక్కున్నాడు.

"రేపటినుంచి, వంటమనిషిని పెట్టమని చెప్పు కళ్యాణ్ మీ నాన్నగారికి. డ్యూటీ చేస్తూ నేను ఇంతకంటే చెయ్యలేను. అయినా అత్తయ్యగారు రకరకాలుగా చేసినప్పుడు కూడా ఇలానే విసుక్కున్నారు కదా. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటో" వ్యంగ్యంగా అంది శ్రుతి.

మర్నాటి నుంచీ ప్రకాష్‌కి విసుర్లు మొదలయ్యాయి.

'ఏంటి కళ్యాణ్, నువ్వు కూడా మీ నాన్నలాగా ఎక్కడి వస్తువులు అక్కడ పడేస్తావు, సర్దిపెట్టు' అని ఒకసారీ... 'నేను చేసిన వంట బావుంటే, మెచ్చుకోవాలి. అప్పుడే చేయబుద్ధి అవుతుంది. మీ అమ్మగారికి ఉన్నంత ఓర్పు లేదు నాకు- వంకలు పెట్టినా పట్టించుకోక పోవడానికి' అని ఒకసారీ విసుర్లు వినిపిస్తున్నాయి.

శ్రుతికి వంట అలవాటు లేకా టైమ్ లేకా సాదాసీదాగా చేస్తుంది. సునీత చేతి వంట రుచే వేరు. ఆ సంగతి ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది ప్రకాష్‌కి.

కళ్యాణ్, 'శ్రుతీ, ఇవాళ పప్పు బావుంది, కూర అదిరింది' అంటుంటే ప్రకాష్‌కి ఒళ్లు మండిపోయేది.

పెళ్ళయిన నాటినుంచీ ఒక్క రోజు కూడా సునీతని మెచ్చుకోలేదు. తల్లి మాటలు విని ప్రతీదానికి తిట్టడం, వంకలు పెట్టడం. అయినా సునీత ఏ రోజూ తనని విసుక్కోలేదు, కోపం తెచ్చుకోలేదు. ప్రకాష్‌కి భార్య విలువ బాగా తెలిసి వస్తోంది.

ప్రతిదానికీ, తాను ఆమె మీద ఎంతగా ఆధారపడ్డాడో అర్థమయింది.

సునీత, చిన్నవాటికి కూడా కోడలిని మెచ్చుకుంటూ ఆప్యాయంగా మాట్లాడుతుంటే, శ్రుతి కూడా సునీతని ఎంతో ప్రేమగా

చూసుకుంటోంది.

ప్రకాష్‌లో నెమ్మదిగా మార్పు మొదలైంది. రోజూ కాసేపు సునీత దగ్గర కూర్చుని మాట్లాడుతున్నాడు. 'ఏమైనా కావాలా? మందులు వేసుకున్నావా?' అని అడుగుతున్నాడు. మామగారిలో ఆ చిన్న మార్పుకే అత్తగారు పొంగిపోతుంటే, 'ఇంకా మారాలి' అని ఆ పొంగు మీద నీళ్ళు చల్లుతోంది శృతి.

వారం తర్వాత, కామాక్షి ఫోన్ చేసింది, "ఇక్కడ అల్లుడు తెగ విసుక్కుంటున్నాడు. 'ముసలివాళ్ళు అయ్యాక తిండి తగ్గించాలి. పెట్టింది నోరుమూసుకుని తినక, వంకలు పెట్టేట్లయితే, మీ ఇంటికి వెళ్ళిపొండి' అన్నాడు. నేను ఇక్కడ ఉండను" అంది కొడుకుతో.

అడకత్తెరలో పోక చెక్కలాగా, ఇక్కడ కోడలి విసుర్లు చెప్పలేకా, తల్లిని తీసుకుని రాలేకా నెమ్మదిగా, "సునీత నీ రూములో ఉంది. శృతి తనకోసం హెల్పర్‌ని పెట్టింది. నువ్వు వస్తే ఉండటానికి ఇబ్బంది" అన్నాడు.

"అయ్యో, పనిమనిషికి నా రూమ్ ఎలా ఇచ్చార్రా... నీ పెళ్ళాన్నీ ఆ పనిమనిషినీ మీ రూమ్‌లో ఉండమని, నువ్వే నా గదిలో ఉండొచ్చు కదా. అయినా బోలెడు డబ్బులు తగలేసి, ఆ పనిమనిషి ఎందుకు? నువ్వు ఎలాగూ రిటైర్ అయ్యావు, ఇంట్లోనే ఉన్నావుగా, ఆ మాత్రం సాయం చెయ్యలేవా?" తల్లి తిడుతుంటే కోపంగా ఫోన్ పెట్టేశాడు ప్రకాష్.

పది రోజుల తర్వాత, సునీతకి కొద్దిగా తగ్గిందని, హెల్పర్‌ని తీసేశారు. తనంతట తనే నెమ్మదిగా ఇంట్లో తిరుగుతోంది సునీత.

కామాక్షమ్మ వెనక్కి వచ్చింది. సునీత కోసం పెట్టిన మనిషి తన రూము అంతా పాడుచేసిందని ఒకటే సణుగుడు.

శృతి ఆ రోజు ఇంట్లోనే ఉంది. వంట చేసి బల్ల మీద అన్నీ సర్ది అందర్నీ భోజనానికి పిలిచింది.

బెండకాయ కూర, ముద్ద పప్పు, సాంబారు, పెరుగు. అందరికీ కంచాల్లో కూరా పప్పూ వేసి అన్నం వడ్డించింది.

కామాక్షమ్మ కంచంలో పదార్థాలు చూస్తూనే, "ఇదేమి వంటే నా తల్లీ. ఈ కూరేంటీ పప్పేంటీ? బెండకాయ కూరలో నూనే ఉప్పూ కారం ఏమీ లేవు, ముద్ద కట్టుకుని సాగుతోంది. సాంబారు పలచగా ఘాటు లేకుండా ఉంది. నీకు వంట వచ్చని గొప్పలు చెప్పావు... ఇదేనా నీకు వంట రావడం. కనీసం నాలుగు రోజులు మీ అత్తగారి దగ్గర నేర్చుకోవచ్చుగా?" అంది ఆవేశంగా.

ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు ప్రకాష్. అటు తల్లినీ సమర్థించలేదు, కోడలినీ ఏమీ అనలేదు. మౌనంగా అన్నం కలిపి తింటోంది సునీత.

"అవును శృతీ, ఏంటి ఈ వంట? మా అమ్మ అంత బాగా వంట చేస్తేనే, మా నాన్నకీ బామ్మకీ నచ్చదు. ఇక నువ్వు చేసిన ఈ వంట ఎలా తింటారు?" కొంచెం కోపం గొంతులోకి తెచ్చుకుని అన్నాడు కళ్యాణ్.

ఎప్పుడూ మాట్లాడని కళ్యాణ్ అలా అంటుంటే, నోట్లో పెట్టుకోబోయిన ముద్ద కంచంలో పెట్టి, ఆశ్చర్యంగా చూసింది సునీత.

"అలా అడగరా మనవడా, ఈ గడ్డి తినడం నా వల్ల కాదు" అంటూ లేవబోయింది కామాక్షి.

"కూర్చోండి" గట్టిగా గదిమింది శృతి. "ఏంటి కళ్యాణ్, వంట బాగాలేదా? మీ బామ్మకి బీపీ ఎక్కువగా ఉంది, షుగర్ కంట్రోల్‌లో లేదు. ఆవిడ పాదాలు చూశావా నీరు పట్టి వాచి ఉన్నాయి. ఎనభై ఏళ్ళ ఆవిడ ముప్పొద్దులా అన్ని పచ్చళ్ళూ స్వీట్‌లతో... ఆ తిండి ఏమిటి?



మీ నాన్నగారికీ షుగర్ పెరిగింది. మొన్ననే నేను చెక్ చేశాను. వాళ్ళిద్దరికీ పూర్తి పథ్యం భోజనం పెట్టాలి. నిన్నటి వరకూ- ఉప్పులూ కారాలూ నూనే వేసి ఘనంగా మీ అమ్మగారు వంట చేస్తే, తీరిగ్గా కూర్చుని అందరూ వంకలు పెట్టారు.

ఇప్పుడు ఆవిడ కాలి నొప్పితో మంచంమీద ఉంది. ఇంట్లో పనంతా నేను ఒక్కదాన్ని ఎలా చేసుకుంటున్నానో ఏమన్నా ఆలోచించారా? నా వంట ఎవరికి నచ్చకపోతే వాళ్ళు రెండు రోజులు చెయ్యండి. నేనూ కూర్చుని తింటాను. పని చెయ్యకుండా ఇలా వంకలు పెట్టడం నాకు నచ్చదు" గయ్యిమంది శృతి.

"ఏంటి అమ్మమ్మగారూ, నేను అత్తయ్యగారి దగ్గర వంట నేర్చుకోవాలా? ఆవిడ వంటకి రోజూ వంకలు పెడతారుగా... మరి ఆవిడ దగ్గర ఎందుకు నేర్చుకోవాలి? నాల్రోజులు మీరు చెయ్యండి... చూసి నేర్చుకుంటాన్నేను" ఆవేశంగా అని, ఊపిరి పీల్చుకుంది.

ఎర్రబడ్డ శృతి మొహం చూసి, ఆమె చూడకుండా ముసిముసిగా నవ్వాడు కళ్యాణ్.

ప్రకాష్ బిత్తరపోయి చూస్తున్నాడు.

కొంచెం ముందుగా తేరుకున్న సునీత, "ఊరుకోమ్మా శృతీ, పెద్దావిడ... అమ్మమ్మగారితో నువ్వు అలా మాట్లాడకూడదు. రేపటినుంచీ వంట నేను చేస్తానుగా, నీకెందుకు ఈ గోల?" అంది.

"ఎన్ని రోజులు అత్తయ్యా మీకు ఈ చాకిరీ. ఒక మెప్పూ లేదు, మెహర్బానీ లేదు. కనీసం ఇవాళ వంట బావుందని కానీ, మా కోడలు మంచిది నన్ను బాగా చూసుకుంటుంది అని కానీ, ఒక చిన్న మాట లేదు, మీకు కోపం ఎందుకు రాదసలు?" ఉక్రోషంగా అంది శృతి.

ఫక్కున నవ్వింది సునీత. "నేను నిజంగా కోపం తెచ్చుకుంటే, ఈ ఇంట్లో ఉండలేను శృతీ. వీళ్ళకి ఒకరిని విమర్శించడం తప్ప, మెచ్చుకోవడం రాదు. అందుకే నేను ఈ ఇంట్లో చేసే పని ఒక బాధ్యతగా చేస్తాను, ప్రేమగా చెయ్యలేను."

ఇంకా ఏదో అనబోతుంటే, కామాక్షి, "అంటే- మేము నిన్ను ఏదో రాచి రంపాన పెడుతున్నామా" గట్టిగా పెద్ద గొంతు పెట్టి అంది.

"అది మీకే తెలియాలి. మీరు అన్నిటికీ వంకలు పెట్టడం, అది పట్టుకుని ఆయన నన్ను తిట్టడం... కొన్ని రోజులు ఏడ్చాను, కొంతకాలం బాధపడ్డాను, తర్వాత అలవాటుపడి పోయాను. ఆ తర్వాత పట్టించుకోవడం మానేశాను.

ఏదో కోడలిని కంట్రోల్‌లో పెట్టానని సంతోషపడుతున్నారు కానీ, మీరు ఏం పోగొట్టుకున్నారో మీకు తెలీదు అత్తయ్యా. నా కొడుకూ కోడలూ నన్నింత ప్రేమగా చూస్తుంటే, నాకు ఇప్పుడు అర్థమైంది మీరేం కోల్పోయారో. అందుకే, మీరంటే జాలి తప్ప మరేమీ లేదు" అంది సునీత.

సునీత ఇలా మాట్లాడుతుందని ఏ మాత్రం ఊహించని కామాక్షమ్మ కోపంతో ఊగిపోయింది.

"ఒరేయ్ ప్రకాశం, నీ పెళ్ళాం చూడరా, నన్ను అంతలేసి మాటలు అంటుంటే, దాన్ని నాలుగు వాయించకుండా చూస్తూ నిల్చున్నావు" అన్న తల్లితో, "నా పెళ్ళామేనా అమ్మా, నీకేమీ కాదా? అలా అయితే- నా పెళ్ళాం, నా కొడుకు, నా కోడలు ఎలా చెప్తే అలా వింటాను నేను. ఇక్కడ ఉండాలంటే, నువ్వూ వాళ్ళు చెప్పినట్లు విను. లేదంటావా నీ ఇష్టం. ఏనాడూ నీ మాట కాదనలేదు నేను. ఇప్పుడైనా అంతే" కొడుకు మాటలకి నిశ్చేష్టురాలయింది కామాక్షి.

"లే సునీతా, ఎక్కువసేపు కాలు కిందపెడితే, వాపు వచ్చి, నొప్పి ఎక్కువ అవుతుంది. రెస్ట్ తీసుకో" దగ్గరకి వచ్చి చెయ్యి అందిస్తున్న భర్తని ఆశ్చర్యంగా, ఆనందంగా చూసింది సునీత.

శృతి నవ్వుతూ "చిన్నా మాటా... ఒక చిన్నా మాటా..." అని కూనిరాగాలు తీస్తుంటే, ముసిముసిగా నవ్వుకున్నాడు కళ్యాణ్. ★

హోలీ వేళ... నోరూరేలా!

ఎటుచూసినా రంగులే... సర్వం వర్ణరంజితమే అనిపించే హోలీ వేళ వంటకాలూ వెరైటీగా ఉంటే బాగుంటుంది కదా? కాస్త తియ్యగా, కాస్త కారంగా... రుచి ఏదైనా మనసునీ ఉత్సాహంతో నింపేసే ఈ వంటకాలని ఓ సారి ప్రయత్నించి చూడండి...

బ్రెడ్ కస్టర్డ్

కావల్సినవి: బ్రెడ్‌స్లైసులు: నాలుగు, నూనె: రెండు చెంచాలు, నెయ్యి: మూడు చెంచాలు, **కస్టర్డ్ చేయడంకోసం:** పాలు: రెండు కప్పులు, కస్టర్డ్‌పొడి: ఐదు చెంచాలు, చక్కెర: ఆరు చెంచాలు, డ్రైఫ్రూట్స్ పలుకులు: రెండు చెంచాలు, యాలకులు: రెండు, **షుగర్ సిరప్ కోసం:** నీళ్లు: అరకప్పు, చక్కెర: పావుకప్పు, యాలకులు: రెండు, కుంకుమపువ్వు: చిటికెడు.



తయారీ విధానం: స్టవ్‌పైన కడాయిపెట్టి నీళ్లు పోసి చక్కెర, యాలకులు, కుంకుమపువ్వు వేసి కాస్త చిక్కబడ్డాక ఆ షుగర్‌సిరప్‌ని పక్కన పెట్టుకోవాలి. బ్రెడ్ అంచులని తీసేసి ఒక్కో బ్రెడ్‌నీ నాలుగు ముక్కలుగా చేసుకోవాలి. స్టవ్ వెలిగించి కొద్దిగా లోతుగా ఉండే పాన్ పెట్టుకుని నెయ్యి, నూనె వేసుకుని బ్రెడ్ ముక్కలని దోరగా బంగారు రంగులోకి వచ్చేంతవరకూ వేయించుకోవాలి. మరొక గిన్నె తీసుకుని అందులో కప్పున్నర పాలు పోసుకుని సన్న మంట మీద ఐదునిమిషాలు మరగనివ్వాలి. దీనిలో చక్కెర వేసి పూర్తిగా కరగనివ్వాలి. మిగిలిన అరకప్పు పాలల్లో కస్టర్డ్‌పొడి వేసి ఉండల్లేకుండా కలుపుకోవాలి. ఈ కస్టర్డ్ మిశ్రమాన్ని మరుగుతున్న పాలల్లో వేసి కలిపితే ఈ మిశ్రమం దగ్గరకు వస్తుంది. ఇందులో డ్రైఫ్రూట్స్ పలుకులు, యాలకులు వేసి స్టవ్ కట్టేసి పదినిమిషాలు చల్లారనివ్వాలి. ఒక వెడల్పాటి గిన్నెలో బ్రెడ్ స్లైసులని ఉంచి పైనుంచి షుగర్ సిరప్ పోసి ఆపైన కస్టర్డ్ వేసి డ్రైఫ్రూట్స్ పలుకులతో అలంకరిస్తే బ్రెడ్ కస్టర్డ్ రెడీ అవుతుంది.

కొబ్బరికోవా



కావల్సినవి: కొబ్బరికోరు: కప్పున్నర, పాలు: కప్పు, క్రీం: అరకప్పు, చక్కెర: కప్పు, పాలపొడి: కప్పున్నర, నెయ్యి: చెంచా, జామ్: రెండు చెంచాలు.

తయారీ విధానం: ఒక గిన్నెలో కొబ్బరికోరు, పాలు తీసుకుని బాగా కలిపి పెట్టుకోవాలి. స్టవ్ వెలిగించి కడాయి పెట్టి అందులో కొబ్బరికోరు-పాల మిశ్రమాన్ని వేసి ఓ ఐదు నిమిషాలపాటు ఉడకనివ్వాలి. ఆ తర్వాత క్రీం వేసి మొత్తం కలిశాక చక్కెర కూడా వేసి పూర్తిగా కరగనివ్వాలి. ఆపైన పాలపొడి వేసి సన్నమంటమీద బాగా ఉడకనివ్వాలి. ఈ మిశ్రమం దగ్గర అవుతున్నప్పుడు నెయ్యి వేసి కలిపి స్టవ్ కట్టేయాలి. చల్లారాక కొద్ది కొద్దిగా కోవా మిశ్రమాన్ని చేతుల్లోకి తీసుకుని బిళ్లల్లా చేసుకోవాలి. వీటిపైన కొబ్బరిపొడి చల్లి, ఒక్కొక్క చుక్క జామ్‌ని ఉంచితే రుచికరమైన కొబ్బరికోవాలు సిద్ధమైనట్టే.

బీట్‌రూట్ చెక్కలు

కావల్సినవి: బీట్‌రూట్ తురుము: అరకప్పు, బియ్యప్పిండి: మూడు కప్పులు, పచ్చిమిర్చి: ఐదు, అల్లం: చిన్నముక్క, ఉప్పు: తగినంత, జీలకర్ర: చెంచా, కరివేపాకు: రెండు రెబ్బలు, సగ్గుబియ్యం: అరకప్పు, పచ్చిసెనగపప్పు: అరకప్పు, బటర్: ముప్పావుకప్పు, నూనె: వేయించడానికి సరిపడా.


తయారీ విధానం: సగ్గుబియ్యం, పచ్చిసెనగపప్పును రెండుగంటల ముందు నానబెట్టి ఉంచుకోవాలి. అల్లం, పచ్చిమిర్చిని కచ్చాపచ్చాగా మిక్సీపట్టుకోవాలి. ఒక గిన్నెలో బియ్యప్పిండి, మిక్సీపట్టిన అల్లం-పచ్చిమిర్చి పేస్ట్, బటర్, బీట్‌రూట్ తురుము, జీలకర్ర, ఉప్పు, సన్నగా తరిగిన కరివేపాకు, నానబెట్టుకున్న సగ్గుబియ్యం, సెనగపప్పులని కూడా వేసుకుని చక్కగా చపాతీపిండి ముద్దలా కలిపిపెట్టుకోవాలి. ఈ పిండిని చిన్న చిన్న ముద్దలుగా తీసుకుని పూరీలు ఒత్తే ప్రెసర్‌తో నొక్కి చతురస్రాకారంలో ముక్కలా కట్ చేసుకుని నూనెలో వేయించుకోవడమే. చూడచక్కని రంగులో బీట్‌రూట్ చెక్కలు సిద్ధం.



హోలీ పూలు

కావల్సినవి: గోధుమపిండి: కప్పు, నువ్వులు: చెంచా, నెయ్యి: మూడు చెంచాలు, పసుపు: అరచెంచా, బీట్‌రూట్ చిన్నది: ఒకటి, పాలకూర: ఏడు ఆకులు, ఉప్పు: రుచికి తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.

తయారీ విధానం: బీట్‌రూట్ చెక్కు తీసి కొద్దిగా నీళ్లు కలిపి మిక్సీ పట్టుకుని రసం వడకట్టి పెట్టుకోవాలి. అలాగే పాలకూర ఆకులని గ్రైండ్ చేసి రసం తీసి పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో గోధుమపిండి, ఉప్పు, నువ్వులు, నెయ్యి కరిగించి వేసి బాగా కలిపి ఈ మిశ్రమాన్ని మూడు భాగాలుగా వేరుచేసి పెట్టుకోవాలి. ఒక భాగాన్ని బీట్‌రూట్ రసంతోనూ, మరొక దాన్ని పాలకూర రసంతోనూ, చివరి భాగాన్ని పసుపుతోనూ కలిపి తగినన్ని నీళ్లు పోసుకుంటూ చపాతీపిండి ముద్దలా చేసుకోవాలి. వీటిని చిన్నచిన్న పిండిముద్దల్లా చేసుకుని పూరీల్లా ఒత్తుకోవాలి. చాకుతో నిలువుగా గీసుకుని చివర్లు పట్టుకుని మెలి తిప్పితే చూడ్డానికి పొడవాటి పువ్వుల్లా వస్తాయి. వీటిని నూనెలో దోరగా వేయించుకుంటే రంగురంగుల హోలీపూలు సిద్ధం.



సిసింద్రీ


దాగుడుమూతలు

సెలవు రోజు కావడంతో పిల్లలంతా ఎగ్జిబిషన్‌కు వెళ్లారు కదా! పెద్ద చిత్రంలో కిందున్న చిన్న బొమ్మలు దాగున్నాయి. ఎక్కడున్నాయో కనిపెట్టగలరా?



దారి కనుక్కోండి

స్కూల్ నుంచి ఇంటికి వచ్చాడు బంటి. జ్యూస్ తాగి, బర్గర్ తిన్నాక హోంవర్క్ చేసుకోవాలనుకున్నాడు. అదయ్యాక ఆటకు వెళ్దామని సిద్ధమయ్యాడు. ఆ నేస్తానికి అవన్నీ పూర్తి చేసే మార్గం చూపరూ!



నమ్మట్లేదు మరి!

హరి: చిన్నూ... ఈ పెద్దవాళ్లున్నారే, మనల్నెప్పుడూ అర్థం చేసుకోరు..!

చిన్ను: ఏమైంది రా..?

హరి: నాకు లెక్కల్లో 90 మార్కులు వచ్చాయని చెబితే ఇంట్లో ఎవరూ నమ్మడం లేదు సరికదా తొమ్మిది పక్కన సున్నా నేనే కలిపానని అంటున్నారు.


చిన్ను: నిజంగా నువ్వు కలపలేదా?

హరి: కలిపాన్రా, కానీ తొమ్మిది పక్కన సున్నా కాదు, నేను కలిపింది సున్నాకి ముందు తొమ్మిది...

చిన్ను: ఆఁ..

ఏది భిన్నం?

ఇక్కడ మ్యాజిక్ చేసే వ్యక్తులు వేర్వేరు వేషాల్లో ఉన్నా, ఆ బొమ్మల్లో ఒకటి మాత్రం భిన్నంగా ఉంది. అది ఏది?



తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్య ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టగలరా?



ఉల్లి చేసిన మేలు!

ఒక ఊళ్లో రవి అనే యువకుడు ఉండేవాడు. అతను వట్టి సోమరిపోతు. పైపెచ్చు తిండిబోతూనూ. భయస్థుడు కూడా. తరచూ పక్క ఊరిలో ఉండే తన అక్క కమల ఇంటికి వెళ్లి... వారాల తరబడి అక్కడే ఉండేవాడు. తన ఇంటికి రాకుండా చేస్తేనైనా, తమ్ముడు ఏదో ఒక పనిలో చేరి బాగుపడతాడేమోనని అనుకునేదామె. అందుకో ఉపాయం కోసం ఆలోచించసాగింది.




ఒకరోజు కమల భర్త జగదీశ్ ఉదయం నిద్ర లేస్తూనే 'కమలా... ఇవాళ కోడి కూరా, గారెలూ తినాలనిపిస్తోంది. నువ్వు అందుకు అన్నీ సిద్ధం చెయ్యి. నేను కత్తికి పదునుపెట్టి కోడిని కోస్తాను' అంటూ కత్తి తీసుకొని పెరట్లోకి వెళ్లాడు. సరేనంటూ ఉల్లిపాయలు తరగటం ప్రారంభించింది కమల.

ఆ ఘాటుకు ఆమె కళ్లలోంచి నీళ్లు రాసాగాయి. అప్పుడే రవి వచ్చాడు. అతడి మట్టిబుర్రకు అసలు సంగతి తట్టక, 'ఏమైందక్కా.. ఎందుకు అలా ఏడుస్తున్నావు?' అని అడిగాడు. కమలకి వెంటనే ఓ ఆలోచన వచ్చింది. 'ఏం చెప్పను తమ్ముడూ.. నువ్వు ఏ పనీ చేయకుండా సోమరిగా తిరుగుతున్నావని బావకు కోపంగా ఉంది. అందుకే నువ్వు వచ్చేది చూసి, నీ సంగతి చెబుతానంటూ కత్తి బయటకు తీసి, దాన్ని పదును పెట్టేందుకు పెరట్లోకి వెళ్లాడు. ఈ గండం నుంచి నిన్నెలా రక్షించాలో తెలియక ఏడుస్తున్నా' అందామె. ఆ మాటతో కంగారుగా పెరట్లోకి తొంగిచూశాడు రవి. అక్కడ కత్తికి పదును పెడుతూ బావ కనిపించేసరికి హడలెత్తిపోయాడు. ఈలోగా పని ముగించుకొని ఇంట్లోకి వచ్చిన జగదీశ్, రవిని చూసి 'సమయానికి వచ్చావు.. రా రా' అన్నాడు. దాంతో అతడికి ప్రాణం పోయినంత పనైంది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా బయటకు పరుగు తీశాడు. అలా పారిపోతున్న రవిని చూసి... 'కమలా.. ఎన్నడూ లేనిది మీ తమ్ముడు అలా పారిపోతున్నాడేంటి?' అని ఆశ్చర్యంగా అడిగాడు జగదీశ్. "ఇకనుంచి కట్టెలు కొట్టుకొని బుద్ధిగా బతుకుతాడట. నిన్ను అడిగి కత్తి ఇప్పించమన్నాడు. 'నువ్వు అడవికి వెళ్లి కట్టెలు కొడతావూ.. మీ బావ కత్తి ఇస్తాడూ.. చాల్లే సంబడం' అన్నాను. దాంతో కోపం వచ్చి ఇక మన ఇంటికి రానంటూ వెళ్లిపోతున్నాడు" అన్నది కమల. జగదీశ్ చిరాకుగా 'లేక లేక వాడికి మంచి బుద్ధి పుడితే, కత్తి ఇవ్వాల్సింది పోయి కోప్పడ్డావా?' అంటూ బయటికి వెళ్లాడు. 'రవీ... ఆగు.. ఇదిగో కత్తి' అంటూ వెంటపడ్డాడు. ఆ కేకలు విని రవి మరింత వేగంగా పరుగెత్తి ఊరు దాటాడు. చేసేది లేక ఇంటికి తిరిగొచ్చాడు జగదీశ్. 'అంతా ఉల్లి చేసిన మేలు' అనుకుంటూ లోలోపలే సంతోషపడింది కమల.


ఆటాడుకుందాం...

ఇక్కడ రంగురంగుల బొమ్మలూ, అక్కడక్కడా ఖాళీ గడులూ ఉన్నాయి. అడ్డంగా, నిలువుగా ఎటుచూసినా ఒక రంగు బొమ్మ ఒక సారే వచ్చేలా ఆ ఖాళీలను నింపగలరా?



ఆ కేక్ ఏది?

తన పుట్టినరోజు కావడంతో కేక్ కొనడానికి నాన్నతో కలిసి బేకరీకి వెళ్లింది చిన్నూ. ఇక్కడున్న ఆధారాల సాయంతో తనకు నచ్చిన కేక్ ఏదో చెప్పగలరా?



- ★ రెండు వరసల్లో ఉండాలి.
- ★ చాక్లెట్ క్రీమ్ ఇష్టం ఉండదు
- ★ కేకుపైన సరిగ్గా ఐదు చెర్రీలే ఉండాలి.
- ★ టెడ్డీ బొమ్మ ఉండొద్దు
- ★ చాకోస్టిక్స్ అంటే ఇష్టం.

రంగులేద్దాం



జవాబులు

తేడాలేంటి?: 1. రైలు బోగీల సంఖ్య 2. పుస్తకం 3. సిలిండర్ బదులు నీళ్ల క్యాన్ 4. పిల్లి తోక 5. కుందేలు చెవి 6. పాప డ్రెస్ 7. హెలికాప్టర్ దిశ 8. చందమామ.

దాగుడుమూతలు: బాబు చేతిలోని డబ్బాపైన జున్ను ముక్క, స్కూల్ బ్యాగ్ మీద హ్యాండ్ బ్యాగ్, పాప వెనకనున్న స్తంభం మీద గొడ్డలి, కౌంటర్‌లోని వ్యక్తి తలమీద గిన్నె, రంగులరాట్నంలో బుట్ట, టికెట్ కౌంటర్ మీద పుల్ల ఐస్, టెంట్‌పైన పేపర్ రాకెట్, టికెట్ కౌంటర్ అడుగున టూత్ బ్రష్.

ఏది భిన్నం?: 4 (బంతుల రంగులు)

ఆ కేక్ ఏది?: 6

ఆటాడుకుందాం...




వైద్య ప్రపంచం!



విశాఖలోని కేజీహెచ్ నేపథ్యంగా సాగే నవల ఇది. కథానాయకుడు జూనియర్ డాక్టర్‌గా ప్రతి విభాగంలోనూ కొంతకాలం శిక్షణ తీసుకుంటాడు. ఒకచోట ఎముకల వ్యాధులు, మరోచోట మానసిక రుగ్మతలు, ఇంకోచోట ప్రసూతి గండాలు... ఇలా ఏడాది సమయంలో తాను చూసే వైద్య ప్రపంచాన్ని పాఠకులకు పరిచయం చేస్తాడు. జూనియర్ డాక్టర్ల కష్టాలూ, వైద్యుల త్యాగాలూ, వ్యవస్థలోని లోపాలూ... కథాక్రమంలో అంతర్భాగం అవుతాయి. యువడాక్టర్ల మధ్య అంకురించే ప్రేమలూ, ఆకర్షణలూ రచనకు రొమాంటిక్ కోణాన్నీ అద్దాయి. ఓచోట 'మహిళలోని సున్నితత్వం, సింహంలోని ధైర్యం, డేగలోని తీక్షణమైన చూపు సర్జన్‌కు అవసరం' అంటూ వైద్యులకు ఉండాల్సిన లక్షణాలను వివరించారు రచయిత.

జూనియర్ డాక్టర్; రచన: డాక్టర్ శ్రీకాంత్ మిర్యాల; పేజీలు: 172, వెల: రూ.220
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

బాలకాండ




ప్రపంచీకరణ... పిల్లల అందమైన ప్రపంచాన్ని కొద్దికొద్దిగా మింగేస్తోంది. ఆ ప్రకారంగా చూస్తే... గ్లోబలైజేషన్ మొదలయ్యే సమయానికంతా బాల్యంలోని మాధుర్యాన్ని ఆసాంతం ఆస్వాదించినవాళ్లే అదృష్టవంతులు. అలా అని, అప్పట్లో కష్టాలే లేవని కాదు. చాలానే ఉన్నాయి. అవన్నీ, పాఠాలై వ్యక్తిత్వ నిర్మాణంలో పునాదులుగా నిలిచాయి. సరిగ్గా ఆ సమయంలోనే తెలంగాణలోని ఓ తండాలో పుట్టిపెరిగిన అరవింద్ అలనాటి జ్ఞాపకాల్ని ఓ పుస్తకంగా తీసుకొచ్చారు. సంక్షేమ హాస్టల్ చదువులూ, బ్లాక్ అండ్ వైట్ టీవీ వీక్షణలూ, సినిమా పాటల పుస్తకాలూ, యూరియా బస్తాల స్కూల్ బ్యాగులూ, సైకిలు సవారీ ప్రహసనాలూ, వేసవిలో పొలం పనులూ... ఇలా పుస్తకం చదువుతున్నంత సేపూ రచయిత అనుభవాల్ని మన తీపి గుర్తులతో ముడిపెట్టుకుని మురిసిపోతాం.

నైన్టీస్ కిడ్ మ్యూజింగ్స్; రచన: అరవింద్ ఎ.వి.
పేజీలు: 140, వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

సమీక్ష

ఊహా జగత్తు!



తెలుగు సాహిత్యంలో మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన కాశీమజిలీ కథల స్థానం ఎంతో ప్రత్యేకం. నూట పాతికేళ్లనాటి ఈ కథలు అనేక నలుపు-తెలుపు జానపద చిత్రాలకు స్ఫూర్తినిచ్చాయి కూడా. బంగారు ఎలుకలూ, రెక్కల గుర్రాలూ, ఒంటికన్ను రాక్షసులూ, సాహసవంతులైన రాకుమారులూ... వగైరా వగైరా పాత్రలు మనల్ని ఊహా ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. సూర్యనారాయణశర్మ ఆ కాల్పనిక సాహిత్యాన్ని అలతి పదాలలో తిరగరాసి, మూడు సంపుటాలలో అందిస్తున్నారు. ఈ కథలు అంతర్లీనంగా ధర్మ సూక్ష్మాలనూ, ఆధ్యాత్మిక రహస్యాలనూ, మానవతా విలువలనూ బోధిస్తాయి.

కాశీమజిలీ కథలు (మూడు భాగాలు); అనుసృజన: నేతి సూర్యనారాయణ శర్మ
పేజీలు: 322, 298, 290 (ఒక్కో భాగం) వెల: రూ.999 (మూడు భాగాలూ)
ప్రతులకు: ఫోన్: 9032462565

చదివించే కథలు



సమాజంలో మానవత్వం అడుగంటిపోయిందని అనుకుంటాం. అయితే, ఆ అభిప్రాయం తప్పని చాటుతూ... చాగంటి ప్రసాద్ 'నిశ్శబ్ద ఖడ్గం' సంకలనంలోని చాలా పాత్రలు మంచితనంతో మనసుల్ని దోచుకుంటాయి. బోళాతనంలో తమకు పోటీలేనట్టుగా వ్యవహరిస్తాయి. 'చిద్విలాసుడు'లో సన్యాసీ, 'సగము నివ్వెరపోయే'లో పార్వతి, 'తీరని రుణం'లో బాలయ్య - మన బంధుమిత్రుల్లో ఒకరిలానే అనిపిస్తారు. 'పురుషార్థం' కథలో పౌరోహిత్యం చేస్తున్న అబ్బాయిలకు ఆడపిల్లలు దొరకని పరిస్థితి గురించి చర్చించారు. 'తాను కూర్చున్న కొమ్మ విరిగిపోతుందనే భయం పక్షికి ఉండదు. ఎందుకంటే, వాలిన కొమ్మను నమ్ముకోదది. తన రెక్కల్నే నమ్ముకుంటుంది' తరహా స్ఫూర్తిదాయక వాక్యాలూ అక్కడక్కడా తళుక్కుమంటాయి.

నిశ్శబ్ద ఖడ్గం (కథలు); రచన: చాగంటి ప్రసాద్, పేజీలు: 112, వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

బుక్‌షెల్ఫ్

శూద్రుల తిరుగుబాటు
రచన: కంచ ఐలయ్య షెఫర్డ్
అనువాదం: ప్రభాకర్ మందార
పేజీలు: 240, వెల: రూ.300
ప్రతులకు: ఫోన్: 9381559238

వంశీ కథలు -2025
సంకలనం: తెన్నేటి సుధాదేవి
పేజీలు: 212, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 9849023852

పల్లేరుకాయలు (నవల)
రచన: డాక్టర్ బి.వి.ఎన్.స్వామి
పేజీలు: 126, వెల: రూ.120
ప్రతులకు: ఫోన్: 9848787284

కృష్ణుడితో నా సంభాషణ
రచన: తెన్నేటి సిద్ధార్థ
అనువాదం: తెన్నేటి శ్యామకృష్ణ
పేజీలు: 276, వెల: రూ.300
ప్రతులకు: ఫోన్: 8558899478

విజ్ఞానశాస్త్రంలో వనితలు
రచన: శారద (బ్రిస్బేన్)
పేజీలు: 95, వెల: రూ.120
ప్రతులకు: ఫోన్: 8096310140

కళాతపస్వి... కళాభరణాలు
రచన: రాకేశ్ బొడ్డుల
పేజీలు: 205, వెల: రూ.250
ప్రతులకు: ఫోన్: 8247765506

తెలుగు సాహిత్యంలో హాస్యామృతం
రచన: డాక్టర్ ద్వా.నా.శాస్త్రి
పేజీలు: 310, వెల: రూ.250
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

వడ్డాది పాపయ్య కథలు
సంపాదకులు: సుంకర చలపతిరావు
పేజీలు: 112 వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 9154688223

చతురోక్తులు
సంకలనం: కూతురు రాంరెడ్డి
పేజీలు: 152, వెల: రూ.200
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

నా జీవన యాత్ర
రచన: డా॥ కర్నాటి లింగయ్య
పేజీలు: 354, వెల: రూ.499
ప్రతులకు: ఫోన్: 8332947239

రాశిఫలం

గ్రహబలం
(మార్చి 1 - 7)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి



మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

మంచి ఫలితాలు ఉంటాయి. అదృష్టం వరిస్తుంది. ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తారు. సకాలంలో, సరైన ప్రయత్నాలతో ఉన్నత స్థానానికి చేరుకుంటారు. పెద్దల ప్రోత్సాహం లభిస్తుంది. పదోన్నతులకు ఆస్కారం ఉంది. వ్యాపారాన్ని విస్తరిస్తారు. స్థిరచరాస్తులు వృద్ధి చెందుతాయి. కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. లక్ష్మీదేవిని పూజించండి.

వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అదృష్టయోగం ఉంది. సకాలంలో ప్రయత్నాలను ఆరంభించండి. ఫలితాలు అనుకూలంగా ఉంటాయి. బాధ్యతాయుత ప్రవర్తనతో వ్యాపార సమస్యల్ని అధిగమిస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి స్పందించాలి. ఉద్యోగంలో కలిసొస్తుంది. నలుగురికీ మేలు చేస్తారు. లక్ష్మీ అష్టోత్తరాన్ని పఠించండి.

మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ధనయోగం ఉంది. అవసరాలకు తగినట్టుగా ఆదాయ మార్గాలను పెంచుకుంటారు. ఆత్మవిశ్వాసంతో కొత్త పనులను ప్రారంభించండి. స్నేహితుల సహాయం లభిస్తుంది. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోకండి. కాలం కొంతమేర వ్యతిరేకంగా ఉంది కాబట్టి, జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఒత్తిడికి గురికాకండి. నవగ్రహాలను పూజించండి.

కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

మనోబలంతో పనులను ప్రారంభించండి. చెడు ఫలితాల గురించి అతిగా ఊహించుకోవద్దు. మీరు నమ్మిన ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. మిశ్రమకాలం నడుస్తోంది కాబట్టి, ఆచితూచి వ్యవహరించాలి. వారం మధ్యలో ఓ పని పూర్తవుతుంది. మేలు చేయబోతే కీడు జరిగే పరిస్థితులు ఉన్నాయి. కొత్తవారిని నమ్మకండి. విష్ణుమూర్తిని అర్చించండి.

సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

గురుబలం వెన్నంటి నిలుస్తుంది. మిశ్రమకాలం నడుస్తోంది. ఆత్మవిశ్వాసంతో అవరోధాలను అధిగమించాలి. అతిగా ఆలోచించవద్దు. పరిస్థితులకు తగినట్టు నడుచుకోండి. ఆశావాదం అవసరం. క్రమంగా పరిస్థితులు అనుకూలిస్తాయి. నిర్ణయాల్లో కుటుంబాన్ని భాగం చేయండి. నవగ్రహాలను పూజించండి.

కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

లక్ష్య సాధనకు అనువైన సమయం. గ్రహబలం అనుకూలం. ప్రయత్నాలు ఫలవంతం అవుతాయి. ఉత్తమ ఆలోచనా విధానంతో వ్యవహరించండి. వృత్తి, ఉద్యోగాల్లో మేలైన ఫలితాలను సాధిస్తారు. సమాజంలో గుర్తింపు లభిస్తుంది. కుటుంబంతో ఆనందంగా గడుపుతారు. శ్రీమహాలక్ష్మిని ఉపాసించండి.

తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అన్నివిధాలా అత్యుత్తమమైన కాలం. భవిష్యత్తు శుభప్రదం. ఆర్థిక ఫలితాలు బావుంటాయి. భాగ్య బృహస్పతియోగం వెన్నంటి నిలుస్తుంది. సంపదలు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల విజయాలు ఆనందాన్ని కలిగిస్తాయి. వేడుకల్లో పాల్గొంటారు. వారం మధ్యలో ఓ శుభవార్త వింటారు. లక్ష్మీ అష్టోత్తరాన్ని పారాయణం చేయండి.

వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపారయోగం ఉంది. తెలివిగా నిర్ణయాలు తీసుకుంటారు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సృజనాత్మక ఆలోచనలతో సమస్యల్ని అధిగమిస్తారు. పెట్టుబడుల రూపంలో అవసరమైన డబ్బు సమకూరుతుంది. గతంలోని గ్రహ దోషాలన్నీ తొలగిపోతాయి. వారం మధ్యలో ఓ మంచి జరుగుతుంది. ఆత్మీయుల అండ లభిస్తుంది. నవగ్రహాలను పూజించండి.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఉద్యోగ ఫలితాలు ఉత్తమంగా ఉంటాయి. రాజయోగం సూచితం. మీ చొరవ ఉన్నత స్థానంలో నిలబెడుతుంది. కొన్ని నిర్ణయాల్లో ధైర్యం అవసరం. తక్షణ స్పందనతో వ్యాపార సంక్షోభాలను సమర్థంగా అడ్డుకుంటారు. పొదుపు-మదుపు ప్రయత్నాలకు ప్రాధాన్యం ఇవ్వండి. చంచలత్వం వద్దు. శ్రీలక్ష్మీ అష్టకాన్ని పఠించండి.

మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభయోగం ఉంది. కృషికి తగిన లాభాలు ఉంటాయి. వ్యాపార విస్తరణకు అనువైన సమయం. స్నేహితుల వల్ల మేలు జరుగుతుంది. దానధర్మాలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొహమాటాలకు ఆస్కారం ఇవ్వకండి. ధైర్యం, సంయమనం చాలా అవసరం. మహాలక్ష్మిని పూజించండి.

కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

ఆత్మవిశ్వాసంతో కొత్త కార్యక్రమాలను మొదలుపెట్టండి. మనోబలం అవసరం. పనుల్ని వాయిదా వేయకండి. ఆర్థిక ఫలితాలు అనుకూలంగా ఉంటాయి. కీలక సమయాల్లో స్వతంత్రంగా వ్యవహరించండి. స్వబుద్ధితో నిర్ణయాలు తీసుకోండి. ఆత్మీయుల మధ్య అపార్థాలకు ఆస్కారం ఉంది. మితభాషణం మేలు చేస్తుంది. విష్ణు సహస్రనామాలను పఠించండి.

మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

అవసరాలకు డబ్బు అందుతుంది. వృథా వ్యయాలు వద్దు. సకాలంలో స్పందిస్తే ఆటంకాలను అధిగమించగలరు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయండి. కుటుంబ సభ్యుల సలహాలు తీసుకోండి. వృత్తి ఉద్యోగాల్లో ఒత్తిడికి గురికాకండి. వివాదాస్పద వ్యక్తులను దూరం ఉంచండి. వారాంతంలో కొన్ని పనులు అనుకూలిస్తాయి. నవగ్రహాల్ని పూజించండి.

పదకేళి

కూర్పు: బాలు

1		2	3		●	4		5	6		●
	●	7		●	8		●	9		●	10
11			●	12		●	13		●	14	
	●	15			●	16		●	17	●	
●	18		●	19	20	●	21	22		23	●
24		●	25	●	26		●		●	27	
●	28		●	29		●	30	●	31		●
32		●	●	33		34	●	35	●	36	37
	●	38			●	39	40		41	●	
42	43		●	44	45			●	46	47	
●		●	48	●	49		●	50	●	51	
52						●	53	●	54		

ఆధారాలు- అడ్డం

1. పార్వతీదేవి (5)
4. గొప్పవారు; ఒకరిని మించిన వారొకరు! (5)
7. భూమిలోంచి పైకి ఉబికే నీటిధార (2)
8. దండ, హారం (2)
9. నిప్పు రాజేస్తే ఏం రేగుతుంది? (2)
11. కంపించు, గడగడలాడు (3)
12. పర్వతం (2)
13. నవరసాల్లో ఒకటి (2)
14. రెండు, జత; సమానం (2)
15. హనుమ (3)
16. సంక్రాంతికి కోనసీమలో ఊరేగించేది? (2)
18. శత్రువు (2)
19. దుఃఖం, బాధ, బెంగ (2)
21. విముక్తి, విడుదల, మోక్షం (4)
24. దప్పిక (2)
25. అడ్డం 18తో ఒక తీపి వంటకం (1)
26. బలగం, దళం, టీమ్ (2)
27. దూరం (2)
28. సొమ్ము, ధనం (2)
29. ఉమాదేవి... సగమే (2)
30. అడ్డం 7తో సముద్రం (1)
31. శరీరం (2)
32. గారాబం (2)
33. మేనా (3)
36. ఆరంభం లేని 'నడుము' (2)
38. రచ్చరచ్చ (3)
39. చతురంగ బలాలతో ఆడే ఆట... చెస్ (4)
42. మూడు మొనలు కలిగిన ఆకారం... ట్రైయాంగిల్ (3)
44. సత్యభామ చేతిలో హతుడైన రాక్షసుడు (4)
46. హరిద్రం (3)
49. రెండొంతుల జలుబు (2)
50. అడ్డం 36 ముందు చేర్చితే వినాయకచవితికి చేసే వంటకం (1)
51. ఛాయ (2)
52. మలయానిలం, పిల్ల తెమ్మెర (6)
53. అడ్డం 16తో తెలుగు సంవత్సరాలలో మొదటిది (1)
54. ఇరవైఐదు (3)

ఆధారాలు- నిలువు

1. ఆరు పదులు (4)
2. రాజుగారి కుమార్తె (5)
3. దురద (2)
4. విలాసం, హొయలు (2)
5. ఒక రుతువు (3)
6. స్విచ్ (2)
8. పాండురాజు భార్య (2)
10. ఛత్రం (3)
12. వనిత (3)
13. గౌరి (3)
17. జొన్నకంకి కాడ (2)
18. గర్వం (4)
20. చాలా పెద్ద- మనిషి మోయలేనంత పూలదండని ఇలా అంటారు (4)
22. గడ్డి కట్ట (2)
23. కుమారుడు (4)
29. పూజ, అర్చన, ఆరాధన (4)
32. వేదమాత, ఒక మంత్రం (3)
34. విరాటుని భార్య అయిన సుదేష్ణ తోడబుట్టినవారు... భీముడి చేతిలో హతమయ్యారు (4)
35. అపరాధం, తప్పిదం (2)
37. నాసికాభరణం (5)
38. యుద్ధం (2)
40. సోదరుడు- 2,4 (2)
41. బుట్ట, తట్ట (2)
43. పికం (3)
45. వెండి (3)
47. అమ్మాయి పేరు... మంచి నీతి కలది అని అర్థం (3)
48. ఒక విరామచిహ్నం (2)

4	3		9		6		1	7
	7		2					
						2		6
3			5				2	9
8		5		4		6		1
6	9				1			5
7		3						
					7		9	
9	4		1		2		6	3

గతవారం సమాధానాలు


పదకేళి


1 అ	యో	2 ని	జ	■	3 వ	4 ని	■	5 అ	6 సు	మ	7 తి
శో	■	గ్గ	■	8 ని	రం	జ	9 న	■	గ్గ	■	రు
10 కు	ళ్ళు	■	11 నీ	రా	■	■	12 వ	క్ర	■	13 వే	ప
డు	■	14 దం	■	15 శ	కుం	త	ల	■	16 మా	■	తి
■	17 అ	డ	18 వి	■	■	■	■	19 చి	సు	20 కు	■
21 మా	నం	■	హం	■	22 క	23 ల	■	న్న	■	24 మా	25 సం
26 తా	త	■	గా	■	27 పి	త	■	త	■	28 రు	జ
■	29 రం	30 గు	లు	■	■	■	■	31 నం	32 దు	డు	■
33 అ	■	డ్డు	■	34 ఆ	లం	బ	35 న	■	డ్డు	■	36 అం
37 వ	న్న	■	38 బం	క	■	■	39 య	తి	■	40 రా	ధ
నిం	■	41 పుం	■	42 సం	43 య	44 మ	నం	■	45 దే	■	కా
46 ద	సు	జు	డు	■	47 మి	న్ను	■	48 అ	హం	కా	రం

సుడోకు

8	3	1	7	6	9	5	2	4
6	2	4	8	1	5	3	7	9
7	5	9	4	2	3	6	1	8
1	8	3	6	9	2	7	4	5
9	7	6	1	5	4	8	3	2
2	4	5	3	7	8	1	9	6
3	1	8	9	4	6	2	5	7
5	9	7	2	8	1	4	6	3
4	6	2	5	3	7	9	8	1

A B C D E F 1 2 3



పూసలు గుచ్చీ... ప్రాణం పోసి!







సూదీదారంతో ఒక్కో పూసా గుచ్చుతూ దుస్తులమీద చిన్న చిన్న పూలతలూ, పిట్టలూ, నెమళ్ల లాంటి ఎంబ్రాయిడరీ డిజైన్లు వేయాలంటేనే ఎంతో నేర్పు కావాలి కదా. అలాంటిది కేవలం రంగు రంగుల పూసల్ని దారానికి గుచ్చుతూ మనుషుల చిత్రాలకు రూపమిస్తే? ముక్కూమొహంతోపాటు అందులో నవ్వు, కోపం, సిగ్గు, బాధ, భయం... తదితర హావభావాల్నీ పలికిస్తే? చూసినవారెవరైనా సరే, కళాకారుల పనితీరుకు ఫిదా అవకుండా ఉండగలరా! నిజంగానే అంత ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు కొంతమంది బీడ్స్ ఆర్టిస్టులు. పూసల వరసల్లో బొమ్మ ఆకారానికి తగ్గ రంగుల బీడ్స్‌ను ఎంచుకుని గుచ్చుతూ ఇదిగో ఇక్కడున్న చిత్రాలన్నింటినీ తయారుచేశారు. బీడ్స్‌తో ఏదో ఒక బొమ్మ రూపాన్ని తేవడం అన్నది అటుంచితే, అసలు ఫొటోలోని వ్యక్తుల పోలికల్నీ అచ్చుగుద్దినట్టుగా దింపేయడం నిజంగా గొప్ప విషయమే మరి!



నీలాకాశంలో ఎక్కడో ఓ చోట ఇంద్రధనుస్సు కనిపిస్తేనే చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. అలాంటిది అంబరమంతా హరివిల్లు పరుచుకుంటే- ఆకాశంతో హోలీ ఆడినట్టు ఎంత అద్భుతంగా ఉంటుందో కదా! ఐర్లాండ్‌లోని మర్‌లా బే కౌంటీలో ఆవిష్కృతమైన అరుదైన ‘అరోరా బొరియాలిస్’ సప్తవర్ణాల్లో కనువిందు చేస్తుంటే... ఆ సుందర దృశ్యాన్ని ఓ ఫొటోగ్రాఫర్ తన కెమెరాలో బంధించాడు!